

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షం

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం ఆర్ఏఆర్ఎస్‌లో జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయ సమావేశంలో జిల్లాలో వ్యవసాయ పరిస్థితిపై సమీక్షించారు. ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 35.7 నుంచి 36.8 డిగ్రీలు నమోదు అయ్యే అవకాశం వుందని, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వరి నారుమడులు నీటిఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలన్నారు. నేలలో పదును చూసుకుని ... మిగతా 8వ పేజీలో

పారిశుధ్య లోపంపై కలెక్టర్ కన్నెర్ర

ముకుందపురం, వడ్డాది గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు

- డ్రైనేజీ కాలువలు, రోడ్లపై చెత్త పేరుకుపోవడంపై ఆగ్రహం
- పరిస్థితిని చక్కదిద్దకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరిక



మాడుగుల మండలం ముకుందపురంలో డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

మాడుగుల, బుచ్చెయ్యపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): **గ్రామాల్లో పారిశుధ్య లోపంపై కలెక్టర్ విజయకృష్ణన్ తీవ్ర అసహనం చెందారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. మాడుగుల మండలం ముకుందపురంలో ఐదు రోజుల్లో పారిశుధ్యం మెరుగుపడకపోతే సస్పెండ్ చేస్తానని పంచాయతీ కార్యదర్శిని హెచ్చరించారు. బుచ్చెయ్యపేట మండలంలో వడ్డాదిలో డ్రైనేజీ కాలువలు, రోడ్డు పక్కన చెత్త పేరుకుపోవడం, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయకపోవడంపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులపై కలెక్టర్ మండిపడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.**

కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం ఉదయం మాడుగుల మండలం ముకుందపురం గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మెయిన్‌రోడ్డు నుంచి గ్రామ సచివాలయం వరకు నడుచుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును చూసిన ఆమె.. ఈవోపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ చెత్త నిర్వహణ అధ్వానంగా వుండడంతో అసహనం చెందారు. ఐదు రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే సస్పెండ్ చేస్తానని పంచాయతీ కార్యదర్శిని హెచ్చరించారు. అనంతరం మహిళలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీ అధికారులు పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. భూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ రమాదేవిని ఆదేశించారు. ప్రజలు.. ముఖ్యంగా గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఏఎన్ఎం అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు.

వడ్డాదిలో..

కలెక్టర్ విజయకృష్ణన్ ముకుందపురం పర్యటన తరువాత బుచ్చెయ్యపేట మండలంలో వడ్డాది గ్రామాన్ని సందర్శించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ అధికారులతో సమీక్ష నిర్వహించారు. డ్రైనేజీ కాలువలు, రోడ్లపై చెత్త పేరుకుపోవడాన్ని గమనించిన ఆమె సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద కేంద్రం నిర్వహణ, ఆదాయానికి సంబంధించి వివరాలు అడగ్గా.. సిబ్బంది తెల్లమొహం వేయడంతో మండిపడ్డారు. మండల పర్యటనకు వస్తున్నట్టు ముందుగానే సమాచారం ఇచ్చానని, అయినప్పటికీ రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సిబ్బంది తాను అడిగిన సమాచారం ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ బాగాలేదన్నారు. వచ్చే మంగళవారం మరోసారి ఇక్కడకు ... మిగతా 8వ పేజీలో

సరుగుడు, వెన్నలపాలెం

గ్రామాల్లో జ్వరాల విజృంభణ

- సరుగుడుకు చెందిన ఒక యువకుడి మృతి
- వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని బాధితుల వినతి



జైతి శివ (ఫైల్)

నాతవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నలపాలెం, సరుగుడు గ్రామాల్లో వైరల్ జ్వరాలు, అతి సార ప్రబలాయి. జ్వరంతో బాధపడుతూ సరుగుడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందాడు. గ్రామంలో పలువురు గిరిజనులు జ్వరాలబారినపడి మంచాల్లో మగ్గుతున్నారు. వైద్య సిబ్బంది గ్రామం వైపు కన్నెత్తి అయినా చూడడం లేదని ఆరోపిస్తున్నారు. సరుగుడు గ్రామానికి చెందిన జైతి శివ(32)కు సోమవారం జ్వరంతోపాటు విరేచనాలు అధికం కావ డంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిం చారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. సరుగుడు గ్రామంలో 40 మందికిపైగా గిరిజనులు జ్వరాలతో అల్లాడుతున్నారు. కాగా మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెంలో బళ్ల బసవయ్య, వాసిరెడ్డి దేవుళ్లు, గొంప రాము, కోరుప్రోలు చినతల్లి, వాసిరెడ్డి పైడియ్యనాయుడు, మాకిరెడ్డి మురళీమోహన్, కుసిరెడ్డి సత్యవతి తదితరులు వారం రోజుల నుంచి వైరల్ జ్వరాలతో అల్లాడుతున్నారు. వైద్య సిబ్బంది తక్షణమే స్పందించి సరుగుడు, వెన్నలపాలెం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి కోరారు.

రైతులకు ఆర్థిక భరోసా!

రెండో తేదీన 'అన్నదాత సుఖీభవ' డబ్బులు జమ

- ఒక్కో రైతు ఖాతాలో రూ.7 వేలు
- రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు
- ఈ నెలాఖరు నాటికి తుది జాబితా సిద్ధం



బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేటలో దుక్కి దున్నుతున్న రైతు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకం కింద నగదు సాయం అందించడానికి తుది ఏర్పాట్లు చేసింది. వచ్చే నెల రెండో తేదీన 'పీఎం కిసాన్ యోజన' కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రెండు వేల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం తరపున మరో ఐదు వేల రూపాయలు కలిపి మొత్తం ఏడు వేల రూపాయలు ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి.**

ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వున్నప్పటికీ గత ఏడాది సాధారణ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది. వీటిల్లో ఏటా ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు పథకాన్ని గత ఏడాదే ప్రారంభించింది. తల్లికి వందన కార్యక్రమం కింద ఒకటి నుంచి పదో తరగతివరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున అందించే కార్యక్రమానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో శ్రీకారంచుట్టింది. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేయనున్నట్టు ఇప్పటికే ప్రకటించింది. మరో ప్రధానమైన 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఆగస్టు రెండో తేదీన ప్రారంభించనున్నది. పీఎం కిసాన్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఏటా ఆరు వేల రూపాయలు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు ఇవ్వనున్నది. కేంద్ర ప్రభుత్వం ఏడాదిలో మూడుసార్లు రూ.2 వేల చొప్పున ఆయా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆగస్టు రెండో తేదీన రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ చేయనున్నది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకం కింద తన వాటాగా మొదటి దఫా రూ.5 వేలు ఇస్తున్నది. ఈ సొమ్మును కూడా ఆగస్టు రెండో తేదీన ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి చర్యలు చేపట్టింది. ఇందు కోసం ఈ నెలాఖరులోగా అర్హులను గుర్తించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర అధికారులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఇప్పటికే ఆదేశించారు. అన్నదాత సుఖీభవ పథకానికి జిల్లాలో ఇంతవరకు 2,41,637 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వీరిలో 2,37,058 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇంకా 2,499 మంది ఈకేవైసీ చేయాల్సి ఉంది. సరైన పత్రాలు సమర్పించని 2,089 మందిని పథకానికి అనర్హులుగా నిర్ధారించారు. కౌలు రైతులకు కార్డుల ... మిగతా 8వ పేజీలో

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

- దుక్కి దున్నుతుండగా ఘటన



మృతిచెందిన కన్నంరెడ్డి సత్తిబాబు

కశింకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పొలంలో దుక్కి దున్నతుండగా ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని విస్సన్నపేట గ్రామానికి చెందిన కన్నంరెడ్డి సత్తిబాబుకు ట్రాక్టర్ వుంది. దుక్కి దున్నడం, దమ్ము చేయడం, వరి నూర్పులు వంటిపనులతోపాటు భవన నిర్మాణ సామగ్రిని రవాణా చేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో దుక్కి దున్నడానికి వెళ్లాడు. సాయంత్రం 5.45 గంటల సమయంలో మట్టి దిబ్బను ఎక్కించే క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడింది. సత్తాబాబుపై ఇంజన్ పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలో వున్నరైతులు గమనించి, వెంటనే ఆటోలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. సత్తిబాబుకు భార్య మోహిని, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ముగ్గురిని అదుపులోకి తీసుకుని.. రూ.5,11,600 నగదు స్వాధీనం - 8లో

రైవాడ నీరు రైతులకే..

వచ్చే ఏడాది విశాఖకు పోలవరం నీరు

- ఏటా రెండు పంటలతోపాటు ఆయకట్టు స్థిరీకరణ
- మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి
- రైవాడ కాలువలకు నీరు విడుదల



రైవాడ రిజర్వాయర్ వద్ద జలహారతి కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, అధికారులు, కూటమి నాయకులు

దేవరాపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి రైవాడ జలాశయం నీరు మొత్తం ఆయకట్టుకే సరఫరా చేస్తామని, దీంతో ఆయకట్టు స్థిరీకరణతోపాటు ఏటా రెండు పంటలు పండించుకునే అవకాశం లభిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, అధికారులతో కలిసి ఎరకాలమ్మకు పూజలు చేసి హారతి ఇచ్చిన అనంతరం రైవాడ రిజర్వాయర్ నుంచి కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖకు నీరు సరఫరా అవుతుందని, దీంతో రైవాడ నుంచి విశాఖకు నీటిని సరఫరా చేయాల్సిన అవసరం వుండదన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాయగా, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. రైవాడ జలాశయాన్ని రూ.333 కోట్లతో ఆధునీకరించి అభివృద్ధి చేయనున్నట్టు బండారు చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట కోతలు ప్రారంభం కాగానే కాలువలకు నీటి సరఫరాను నిలుపుదల చేసి, ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం పెరుగుతుందని, ఏటా రెండు పంటలు వేసుకోవచ్చని ఆయన చెప్పారు.

ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఈ ఎ.త్రినాథం, డీఈఈ సత్యంనాయుడు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పాత్రునాయుడు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు వాసురెడ్డి ఏసుదాసు, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, కిలపర్తి భాస్కరరావు, గూనూరు ముల్లునాయుడు, పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలు వెలవెల

- పలు గ్రామాల్లో 1,2 తరగతులకే పరిమితమైన స్కూళ్లు



కన్నంపేట శివారు శ్రీరామనగర్ కాలనీ పాఠశాలలో ఒకే ఒక్క విద్యార్థికి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- రావికమతం మండలంలో 11 పాఠశాలల్లో పది మందికన్నా తక్కువ విద్యార్థులు
- వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానాలే కారణమని ప్రజలు ఆరోపణ

రావికమతం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో అరకొరగా విద్యార్థులు వున్నారు. కన్నంపేట శివారు శ్రీరామనగర్ పాఠశాలలో ఒకరు, రావికమతం అంబేడ్కర్ కాలనీ, గుడ్డిప కొత్తూరు పాఠశాలలో ముగ్గురేసి విద్యార్థులు మాత్రమే వున్నారు. మొత్తం మీద 11 పాఠశాలల్లో పది మందికన్నా తక్కువ విద్యార్థులు వున్నారు.**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతన విద్యా విధానం అమలు పేరుతో పలు ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో అప్పటి నుంచి ఈ పాఠశాలలు అరకొర విద్యార్థులతో కొనసాగుతున్నాయి. మండలంలో ఈ ఏడాది మొత్తం 53 ప్రాథమిక పాఠశాలలు వున్నాయి. కన్నంపేట శివారు శ్రీరామనగర్ (ఎస్ఎన్ కాలనీ) ప్రాథమిక పాఠశాలలో ఒకే ఒక్క విద్యార్థి వున్నాడు. ఇతని పాఠా లు బోధించడానికి ఒక ఉపాధ్యాయుడు, మధ్యాహ్న భోజనం వండి వడ్డించడానికి నిర్వాహకురాలు వున్నారు. ఈ కాలనీకి చెందిన పలువురు ఉపాధి నిమిత్తం కుటుంబాలతో సహా ఇతర ప్రాంతాలకు వలసపోవడమే ఇందుకు కారణమని స్థానికులు చెబుతున్నారు. అలాగే రావికమతం అంబేడ్కర్ కాలనీ పాఠశాలలో ముగ్గురు, గుడ్డిప కొత్తూరు పాఠశాలలో నలుగురు విద్యార్థులు వున్నారు. తట్టబంద పంచాయతీ శివారు ఎల్ఎన్ పురంలో ఐదుగురు, గర్నికం శివారు కానాడ పాఠశాలలో ఏడుగురు, తట్టబంద శివారు కశిరెడ్డిపాలెం, కన్నంపేట పాఠశాలల్లో ఎనిమిదేసి మంది, కవ్వగుంట పంచాయతీ శివారు బుడ్డిబంద, మత్స్యవానిపాలెం, అంట్లంపాలెం, గుడ్డిప పాఠశాలల్లో తొమ్మిది మంది చొప్పున విద్యార్థులు వున్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.



నలుగురు విద్యార్థులు మాత్రమే వున్న గుడ్డిప కొత్తూరు స్కూల్



రావికమతం అంబేడ్కర్ కాలనీ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు..

పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు

పారిశ్రామిక వేత్తల దరఖాస్తులను త్వరగా ఆమోదించాలి

- 43 భారీ, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు
- రూ.2,81,760 కోట్ల పెట్టుబడులు, 1,46,673 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి సత్వరమే అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) 15వ జిల్లాస్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, గత మే 26న జరిగిన సమావేశం తరువాత నుంచి ఇప్పటి వరకు వివిధ శాఖల అనుమతి కోసం దరఖాస్తు 685 దరఖాస్తులు రాగా, వాటిలో 615 దరఖాస్తులను ఆమోదించామని తెలిపారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి మిగిలిన దరఖాస్తులను త్వరగా ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. 14 పరిశ్రమలకు సంబంధించిన వివిధ రాయితీల కోసం 37 దరఖాస్తులు రాగా, రూ.5.92 కోట్ల విడుదలకు కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపామన్నారు. జిల్లాలో 43 భారీ, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు వివిధ దశల్లో వున్నాయని, వీటి ద్వారా రూ.2,81,760 కోట్ల పెట్టుబడులు, 1,46,673 మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించే అవకాశాలు వున్నాయన్నారు.

ఈ సందర్భంగా పరిశ్రమల్లో తనిఖీలపై సమీక్ష నిర్వహించారు. 2024 అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు ... మిగతా 8వ పేజీలో

స్టాండింగ్ కమిటీకి 21 నామినేషన్లు

- టీడీపీ నుంచి తొమ్మిది, బీజేపీల నుంచి ఒకటి..
- వైసీపీ నుంచి పది..
- జనసేన నుంచి ఒకటి.. పార్టీ అంగీకారం లేకుండా సాదిక్ నామినేషన్
- నేడు నామినేషన్ల పరిశీలన

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి 21 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. వచ్చే నెల ఆరున జరిగే ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ల దాఖలుకు గడువు మంగళవారంతో ముగిసింది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలకు సభ్యులను ఎన్నుకునేందుకు కమిషనర్ కేతన్‌గార్గ్ ఈనెల 21న నోటిఫికేషన్ జారీచేశారు. వైసీపీ నుంచి పది మంది కార్పొరేటర్లు ఈనెల 26న నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సీట్ల పంపకాలు తేలకపోవడంతో మంగళవారం మధ్యాహ్నం వరకూ పోటీకి దిగే అభ్యర్థులను ఎంపిక చేయలేకపోయారు. చివరకు జనసేన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి దిగడం లేదని స్పష్టం చేయడంతో, బీజేపీకి ఒక సీటు కేటాయించి మిగిలిన తొమ్మిది సీట్లకు టీడీపీ కార్పొరేటర్లను పోటీకి నిలపాలని నిర్ణయించారు. అయితే 39వ వార్డు నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచి వైసీపీలో చేరి, ప్రస్తుతం జనసేనలో చేరిన మహ్మద్ సాదిక్ మంగళవారం ఉదయాన్నే నామినేషన్ దాఖలు చేయడం కూటమి పార్టీల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం కార్పొరేటర్లంతా సమావేశమై పోటీకి దూరంగా ఉండాలనే ... మిగతా 8వ పేజీలో

ఇంటర్ ప్రవేశాలకు తుది గడువు రేపే

కోటవురట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీతో గడువు ముగిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ఏఆర్‌టీ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు తల్లికి వందనం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్టడీ మెటిరియల్, బ్యాగ్‌లు, డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలు గణనీయంగా పెరిగాయన్నారు. కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఏడాది 278 మంది ప్రవేశాలు జరగ్గా.. ఈ ఏడాది 370మంది విద్యార్థులు చేరారని చెప్పారు. 2005-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 31 చివరి తేదీ అని, అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

గృహాలకు యాజమాన్య హక్కుపత్రాలు

కోటవురట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామకంఠంలో నిర్మించుకున్న పక్కాగృహాలకు పూర్తి యాజమాన్య హక్కు పత్రాలు జారీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు కోటవురట్ల డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు తెలిపారు. మంగళవారం మండలపరిషత్ సమావేశ మందిరంలో గ్రామసచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇందుకు సంబంధించి సర్వే నిర్వహించాలన్నారు. గృహాల సరిహద్దులు, ఇళ్లలో నివాసిస్తున్న వారి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని సూచించారు.

పాడి రైతులకు రూ.1.25 లక్షల ఏరువాక బోనస్ పంపిణీ

అచ్యుతాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్టూరులో 23 మంది పాడి రైతులకు రూ.1.25 లక్షల ఏరువాక బోనస్‌ని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా పాడి రైతుల సంక్షేమానికి తమ డెయిరీ అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అన్ని డెయిరీల కన్నా అధిక ధరలకు పాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కె శ్రీనివాసరాజు, బి అప్పలరాజు, శేషురాజు, నరసింహమూర్తి, సాయిరాజు, కుమారరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా కూటమి ప్రభుత్వ పాలన

మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం

మునగపాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా పాలన అందిస్తోందని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం అన్నారు. స్థానిక బీసీ కాలనీలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏడాదిలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాడి శివ, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

▸▸ **జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు**

మునగపాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు. మంగళవారం ఆయన తంపర మూల ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా రైతులకు వరి సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. విత్తన శుద్ధి, విత్తన తయారీ విధానం గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. రైతులు గ్రూపుగా ఏర్పడి ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న డ్రోన్‌ను తీసుకోవడం ప్రయోజనకరమన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి లబ్ధిదారుడు ఎదుర్కొంటున్న సాంకేతికపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కౌలు రైతులకు రుణాలు మంజూరు అంశంపై స్థానిక ఎస్‌బీఐ మేనేజర్‌తో జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడారు. ఆయన వెంట ఏవో సీహెచ్.జ్యోత్స్నకుమారి, వ్యవసాయ శాస్త్రవేత్తలు రమణమూర్తి, పద్మావతి, వీఏఏలు లలిత, లక్ష్మి సరిత, లక్ష్మి, రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆడారి మహేష్, వి.నర్సింగరావు పాల్గొన్నారు.



మునగపాక తంపరమూల ప్రాంతంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

యాజమాన్య పద్ధతులతో వరిలో అధిక దిగుబడులు

రాంబిల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చునని ఎలమంచిలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జాహ్నవి అన్నారు. మంగళవారం దిమిలిలో రైతులకు వరి నారుమడి, ప్రధాన పంటలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ నారుమడిలో జింక్ లోపం గమనించినట్టయితే 2శాతం జింక్ సల్ఫేట్‌ను, ఇనుము లోపం అయితే అనేబేది , నిమ్మఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. సుడోమోనాస్‌తో విత్తనశుద్ధి, జీవామృతం తయారీ, నాట్లు వేసే ముందు నారు చివర్లు త్రుంచి నాటడం గురించి ప్రదర్శించారు. అనంతరం వరి పొలం గట్లు మీద నాటడానికి ఎల్‌ఆర్‌జి-52 కంది మినీ కిట్లులను ఉచితంగా రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏవో సి.సుమంత, జిల్లా వనరుల కేంద్రం ఏవో పి.విజేత, ఏఈఓ, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తమలపాకుల తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాయకరావుపేట రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తమలపాకుల తోటల సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్లను నివారించుకోవచ్చని ఆర్ఏఆర్ఎస్ అనకాపల్లి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రవిబాబు, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీహరి అన్నారు. మండలంలోని సత్యవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమలపాకుల రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు. తమలపాకుల తోటలలో పురుగు ఉనికిని గమనించడానికి పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 5 చొప్పున ఏర్పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆదినారాయణ, డీఆర్సీ ఏవో తులసి, ఏఈఐ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

పాటి కాలువలో పూడికతీత

పనులను అడ్డుకున్న వ్యక్తిని మందలించిన తహశీల్దార్

పాయకరావుపేట రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం వద్ద పాటి కాలువలోని పూడికను మంగళవారం సాగునీటి, రెవెన్యూ అధికారులు తీయించారు. పాటి కాలువలో పూడిక పెరిగి సాగు నీరందక ఇబ్బంది పడుతుండడంతో రైతులందరూ కలిసి పూడికను తీయిస్తుండగా సోమవారం ఒక వ్యక్తి అడ్డుకున్నారు. దీంతో రైతులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం తహశీల్దారు మహేశ్వరరావు గ్రామాన్ని సందర్శించి, కాలువ ను సర్వే చేయించి హద్దులు నిర్ణయించారు. సాగునీటి శాఖ ఏఈ వినయ్ కాలువలోని పూడికను తీయించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మహేశ్వరరావు పాటి కాలువలో పూడిక తీతను అడ్డుకున్న వారిని హెచ్చరించారు. సాగునీటి కాలువ గట్టును ఆక్రమించడమే కాకుండా పూడికతీతను అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ త్రినాథరావు, ఇరిగేషన్ ఏఈఈ వినయ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కలిదిండి సతీష్‌రాజు, ఆవ కాలువ నీటి సంఘం అధ్యక్షుడు గణపర్తి నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.



గోపాలపట్నంలో పాటి కాలువను పరిశీలిస్తున్న తహశీల్దారు మహేశ్వరరావు, తదితరులు

సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

▸▸ **నక్కపల్లి మండల సర్వసభ్య సమావేశం**

నక్కపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సమస్యలపై ప్రజాప్రతినిధులు మండల సమావేశంలో గళమెత్తారు. మంగళవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో ఏ పనులు జరగాలన్నా మధ్యవర్తుల ప్రమేయం ఎక్కువగా కనబడుతోందని కాగిత ఎంపీటీసీ సభ్యుడు గోవిందరావు డీఎల్.పురం ఎంపీటీసీ సభ్యుడు కె.కనకారావు ఆరోపించారు. ఎంపీడీఓ సీతారామరాజు ఆధ్వర్యంలో శాఖల వారీగా రివ్యూ జరిగింది. రెవెన్యూ శాఖ ద్వారా డిప్యూటీ తహశీల్దారు నారాయణరావు మాట్లాడుతూ రెవెన్యూ పరంగా సమస్యలు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఖాళీగా ఉన్న స్థలాలను పేదలకు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుందని, ఇప్పటి వరకు ఎన్ని కాలనీలను పరిశీలించారని ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశానికి రాలేని అధికారులపై జిల్లా కలెక్టర్‌కి తెలియజేయాలని ఎంపీటీసీ సభ్యులు గోవిందరావు, కుంచె మధు, ఇతర సభ్యులు కోరారు. జలజీవన్ మిషన్ పనులపై పలువురు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. చినదొడ్డిగల్లులో సమస్యలు పరిష్కరించాలని వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు కోరారు. ఉపమాకలో ఇంటింటి కొళాయి పనులు సక్రమంగా పూర్తిచేయకపోవడంతో తాగునీరు అందరికీ సరఫరా చేయలేకపోతున్నామని సర్పంచ్ ప్రగడ వీరబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ చలపతిరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం

'వీరమల్లు'పై వైసీపీ నేతల దుష్ప్రచారం

రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్

పాయకరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమాపై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ ఆరోపించారు. మంగళవారం పాయకరావుపేటలో హరిహర వీరమల్లు సినిమా చూసిన అనంతరం ఆయన మాట్లాడుతూ సినిమా సనాతన ధర్మాన్ని కాపాడే విధంగా ఉందన్నారు. అయితే సినిమా విడుదలకు ముందు నుంచి నేటి వరకు వైసీపీ నాయకులు దుష్ప్రచారం ఆపలేదన్నారు. వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, పేర్ని నాని, పోతుల మహేష్ సినిమాపై దుమ్మెత్తి పోయడమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. వీరి ప్రచారం వెనుక మాజీ సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, బీజేపీ నాయకులు పి.రవిరాజు, నేతలు ఇంజరపు సూరిబాబు, దేవాది మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్

కూటమి ప్రభుత్వంతోనే ప్రజారంజక పాలన

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు కరణం రవికుమార్, బొద్దపు శ్రీను

ఎలమంచిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ప్రజారంజక పాలన సాధ్యమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు కరణం రవికుమార్, బొద్దపు శ్రీను అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ నేతలతో కలిసి వారు టిడ్కో గృహసముదాయంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింట తిరిగి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రెట్టింపు పథకాలను అమలు చేశారన్నారు. టిడ్కో సముదాయంలో రహదారి, తాగునీటి సరఫరా, ప్రహరీ సమస్యలను స్థానికులు తెలిపారు. టిడ్కో సముదాయంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్.రాజామహేష్, శ్రీమంతుల శ్రీను, పడాల చంద్రరావు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడ్కో గృహ సముదాయంలో ఇంటింట కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు రవికుమార్, శ్రీను

ప్రజా విశ్వాసం పొందలేకపోయిన కూటమి ప్రభుత్వం : ధర్మశ్రీ

మునగపాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలన ప్రజా విశ్వాసాన్ని పొందలేకపోయిందని వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో జరిగిన వైసీపీ మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చకుండానే సుపరిపాలన అంటూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా దందాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే యూవీ. రమణమూర్తిరాజు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, సర్పంచులు కాండ్రేగుల నూకరాజు, సుందరపు నీలకంఠస్వామి, షేక్ ఇస్మాయిల్, బొద్దపు శ్రీరామ్మూర్తి, దాసరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులకు సన్మానం

ఎలమంచిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామ సచివాలయంలో విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులను కూటమి నేతలు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరరావు(శేషు), టీడీపీ మండల కార్యదర్శి గెంజి శ్రీను మాట్లాడుతూ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకునేలా ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు సానా నానాజీ, ఊటకూటి సత్తిబాబు, ఎడ్ల నారాయణరావు, మొగ్గ బాబూరావు, ఎడ్ల చినబాబు, వి. రవి, కంబాల శ్రీను, అడపా కొండబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎలమంచిలి: సచివాలయ ఉద్యోగిని సత్కరిస్తున్న గొన్నాబత్తుల నాగేశ్వరరావు, గెంజి శ్రీను

ఎస్.రాయవరంలో..

మండలంలోని సర్వసిద్ధి సచివాలయంలో పనిచేసి బదిలీ అయిన ఉద్యోగులను మంగళవారం తహశీల్దార్ తాహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ కురందాసు గణేష్, స్థానిక టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో మాట్లాడుతూ స్థానిక ప్రజలకు సేవలందించే విషయంలో ఉద్యోగులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలమల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పడమటి సతీష్, గుండ బోతుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణ ఫిర్యాదుపై విచారణ



పూడిమడకలో విచారణ జరుపుతున్న తహశీల్దార్ సత్యనారాయణ

అచ్యుతాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకటరమణ మూర్తిరాజు (కన్నబాబు రాజు)పూడిమడకలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మత్స్యకార నాయకుడు మేరుగు రాజుబాబు ఫిర్యాదు మేరకు తహశీల్దార్ జి సత్యనారాయణ మంగళవారం విచారణ జరిపారు. పూడిమడక శివారు కడపాలెంలో వివిధ సర్వే నంబర్లలో 43.73 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ అధికారంలో ఉండగా 22ఏ నుంచి తప్పించి స్వాధీనం చేసుకున్నారన్న ఫిర్యాదు మేరకు తహసీల్దార్ అన్నింటి క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.

పీహెచ్‌సీకి వాటర్ ప్యూరిఫైర్ వితరణ



వాటర్ ప్యూరిఫైర్ అందజేసిన దాతలు, వాసవీక్లబ్ సభ్యులు

పాయకరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దాతలు వాటర్ ప్యూరిఫైర్‌ను వితరణ చేశారు. మంగళవారం పీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దాతలు దాసరి నేస్తాలు దంపతులు రూ. 20వేలు విలువైన వాటర్ ప్యూరిఫైర్‌ని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్‌కి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ వాసవి క్లబ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్ర మంలో వాసవి క్లబ్ అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి వాసు కోశాధికారి ప్రదీప్, సభ్యులు కట్టమూరి నూకరాజు, దాసరి రాజ్‌కుమార్, ప్రకాష్, తాతాజీ, వెంకటేష్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భోజనం రుచికరంగా ఉండాలి

▸▸ **మిడ్డే మీల్స్ నిర్వాహకులకు టీడీపీ నేతల సూచన**



కేహెచ్.వాడ పాఠశాలలో మిడ్డే మీల్స్‌ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మిడ్డే మీల్స్ నిర్వాహకులు మెనూను సక్రమంగా అమలు చేయడంతోపాటు విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు అన్నారు. మంగళవారం స్థానిక ఇందిరాకాలనీలో ఉన్న కేహెచ్.వాడ ఉన్నత పాఠశాలను సందర్శించిన టీడీపీ నాయకులు మిడ్డే మీల్స్ పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా యాళ్ల వరహాలబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడంతో పాటు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జూరి నారాయణరావు, గొల్లపల్లి నాగు, బోడపాటి శ్రీను, సలికే రమణ, చిరుకూరి పేర్రాజు, ఎ.దురాప్రసాద్, కుంచె ప్రసాద్, తాటిపాక లోవరాజు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలుకు సహకరించాలి : తహశీల్దార్

పాయకరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంట కాలువల ఆయకట్టు భూముల నీటి తీరువా వసూలుకు సాగునీటి నీటి సంఘాలు సహకరించాలని తహశీల్దారు మహేశ్వరరావు కోరారు. మంగళవారం తహశీల్దారు కార్యాలయంలో సాగు నీటి సంఘాల చైర్మన్, వైస్‌చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయకట్టు రైతుల నుంచి నీటి తీరువా బకాయిలతో కలిపి రూ.2.3 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. మండలంలో సాగునీటి వనరుల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చాల్సి ఉన్నందున నీటి తీరువాను వంద శాతం వసూలులో రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు. సమావేశంలో మండలంలో సాగునీటి సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పలువురు నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

అచ్యుతాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సీఐ నమ్మి గణేష్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రశాంతి విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్ చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఇబ్బంది పెడితే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వీటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకుముందు పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి మండలంలో గల పాఠశాలలు, కళాశాలల వద్దకు వెళ్లి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

అభివృద్ధిలో భాగమే రోడ్డు విస్తరణ

▸▸ **గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీను**

మునగపాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ కూడా అభివృద్ధిలో భాగమేనని గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో తిమ్మరాజుపేటలో మంగళవారం నిర్వాసితులతో ఆయన సమావేశం అయ్యారు. 19 సంవత్సరాలుగా ఎవరు చేపట్టని విస్తరణకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నడుంబిగించారన్నారు. అందరూ సహకరించడం ద్వారా పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ఆడారి మంజు, సూరిశెట్టి రాము, బీవీ.రమణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అచ్యుతాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం సాయంత్రం కొండకర్ల వద్ద పట్టుకున్నట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. కె.కోటపాడు మండలం చౌడువాడ వద్ద శారదా నది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో లోడింగ్ చేసి, అనుమతులు లేకుండా అచ్యుతాపురం మండలం కొండకర్లకు అక్రమంగా రవాణా చేస్తున్నట్టు చెప్పారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దారుకు అప్పగించామని సీఐ తెలిపారు.

సత్యనారాయణపురంలో సమస్యల వెల్లువ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెలను సస్యశ్యామలంగా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇందుకు విరుద్ధంగా అనకాపల్లి మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ దర్శనమిస్తోంది. ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. మురుగునీటి ప్రవాహం నిత్యకృత్యమైంది. పారిశుధ్య లోపం అడుగడుగునా కనిపిస్తోంది.

- ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్తాచెదారం
- దొంగగెడ్డ వద్ద నిత్యం మురుగునీటి ప్రవాహం
- సరైన మార్గం లేక రాకపోకలకు ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు, పాలకులు


రాళ్లు తేలిపోయి గతుకులతో అధ్వానంగా మారిన మూలపేట రోడ్డు

కొత్తూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురం పంచాయతీకి వెళ్లే ప్రధాన రోడ్డు దారుణంగా తయారైంది. అంతేగాకుండా నిత్యం ఈ మార్గంలో మూలపేట గ్రామానికి కూడా ప్రజలు కాలినడకన, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. పంచాయతీ ఆరంభంలో ఉన్న దొండగెడ్డ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మురుగునీటి కాలువ నిత్యం రోడ్డుపైనే ప్రవహిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో కాలినడక వెళ్లే ప్రజలు మురుగులో నుంచే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. తీవ్ర ఎండ ఉన్నప్పుడే ఇలా ఉంటే, వర్షం వస్తే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేనంత దుస్థితి దాపురిస్తుందని గ్రామస్థులు అసహనం వ్యక్తం


రైల్వే అండర్ బ్రిడ్జి కింద పేరుకుపోయిన చెత్త


సత్యనారాయణపురం-మూలపేట రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా దొంగగెడ్డ సమస్య పరిష్కరించకపోవడంపై ప్రజాప్రతినిధులు పట్ల స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

అలాగే మూలపేట, సత్యనారాయణపురం గ్రామాలకు వెళ్లే దారి పొడవునా ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయింది. మురుగునీటితో పాటు చెత్తాచెదారం కాలువల్లో పేరుకుపోవడంతో భరించలేని తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నదని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే మార్గంలో ఉన్న మురుగునీటిలో వెళ్తే అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని వారు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అంతేగాకుండా దొంగగెడ్డ వద్ద పేరుకుపోయిన చెత్త, మురుగును తరలించి ప్రజల రాకపోకలు సాగించేందుకు మార్గం సుగుమమయ్యేలా చూడాలని వేడుకుంటున్నారు.

కల్తీ మద్యం తయారీ కారకులెవరో తేల్చాల్సిందే..

- ఎక్సైజ్ పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- ప్రధాన సూత్రధారెవరో ప్రజలకు తెలియజేయాలి
- పరవాడ మండల సమావేశంలో సభ్యుల డిమాండ్

పరవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం తయారీ కారకులెవరో తేల్చాల్సిందేనని సభ్యులు పట్టుబట్టారు. ఈ వ్యవహారంలో ఎక్సైజ్ పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రధాన సూత్రధారెవరో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పరవాడలో కల్తీ మద్యం తయారీ వ్యవహారంలో అసలు దోషులు ఎవరో తక్షణమే ప్రజలకు తెలియపరచాలని పరవాడ ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనువాసరావు, రావాడ, పరవాడ సర్పంచులు మోటూరి సన్యాసినాయుడు, శిరపురపు అప్పలనాయుడు సభలో ప్రస్తావించగా, మిగతా సభ్యులు కూడా ఇదే అంశాన్ని లేవనెత్తారు. ఎక్సైజ్ ఎస్ఐ రమణ ఈ విషయమై ఇచ్చిన వివరణకు సభ్యులు సంతృప్తి చెందలేదు. ఈ అంశాన్ని సమావేశంలో తీర్మానం చేయాలని సభ్యులు డిమాండ్ చేయగా, అందుకు ఎంపీడీవో రమేశ్‌నాయుడు అంగీకరించారు. వాడచీపురుపల్లి పశు వైద్యాధికారి సురేశ్ మాట్లాడుతూ నాలుగో విడతగా పశువులకు ఎంఎస్‌డీ వ్యాక్సిన్లు వేస్తామని చెప్పారు. చనిపోయిన పశువులకు ఇన్సూరెన్స్ వర్తింపజేయడం లేదని పి.బోనంగి సర్పంచ్ బండారు కల్పన సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం నిధుల లేమి కారణంగా ఈ సమస్య నెలకొన్నదని పశు వైద్యాధికారి సమాధానమిచ్చారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు జూలై నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ఎంఈవో ఎం.దివాకరరావు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో ముందుగానే ప్రత్యేక తరగతులను ప్రారంభించడం జరిగిందన్నారు. పరవాడ, పెదముషిడివాడ, దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని తహశీల్దార్ బి.నాగరాజు సభలో ప్రస్తావించారు. తాను ఇటీవలే పరవాడ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టానని, ప్రభుత్వ భూముల ఆక్రమణను సహించేది లేదని హెచ్చరించారు. రీసర్వే ప్రక్రియను కూడా తొందరలోనే పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. పరవాడ మండలంలోని పలు ఆర్‌అండ్‌బీ రహదారులు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయని, దీని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పరవాడ సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు సభలో ప్రస్తావించగా, మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఆర్‌అండ్‌బీ జేఈ లలితకుమారి సమాధానమిచ్చారు. ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, దేశపాత్రునిపాలెం, రావాడ గ్రామాల్లో లోవోల్టేజి సమస్య తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని ఈపీడీసీఎల్ ఏఈ శేషసాయి వెల్లడించారు. ఎంపీపీ మాట్లాడుతూ గత సమావేశంలో ఆమోదం తెలిపిన పనులకు త్వరతగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖల నుంచి అధికారులు మాట్లాడి ప్రజా ప్రతినిధుల సమస్యలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి

కల్తీ మద్యం తయారీ అంశంపై సభ్యుల తీర్మానం

పరవాడలో కల్తీ మద్యం తయారీ ప్రధాన సూత్రధారెవరో తెలియజేయాలన్న విషయమై మండల సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో రమేశ్‌నాయుడు వివరించారు. ఈ అంశాన్ని సమావేశంలో తీర్మానం చేయడం పట్ల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు.

రహదారులను పరిశుభ్రంగా ఉంచండి


- జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి



సుంకరమెట్ట జంక్షన్‌ను పరిశీలిస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహదారులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సూచించారు. పట్టణంలో మంగళవారం ఆయన పర్యటించారు. పట్టణానికి ముఖ ద్వారమైన సుంకరమెట్ట జంక్షన్‌ను పరిశీలించారు. ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేసి, రహదారులపై చెత్తా చెదారం నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనకాపల్లి పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి సమిష్టిగా కృషి చేద్దామన్నారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అల్పాహారం తీసుకొని బయటకు వస్తున్న ప్రజలను ఆయన ప్రశ్నించారు. సౌకర్యాలు, ఆహారం ఎలా ఉన్నాయని ప్రశ్నించగా, చాలా బాగున్నాయని, రూ.5కే అల్పాహారం అందించడం తమలాంటి పేదవారికి ఒక వరంలాంటిదని మహిళలు పేర్కొన్నారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ రవి, సిబ్బంది ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


అవగాహన సదస్సులో విద్యార్థులతోమాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

సబ్బవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ జి.రామచంద్రరావు సూచించారు. స్థానిక గురుగుల విద్యాలయంలో మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల దుష్పరిణామాలు, చట్టపరమైన శిక్షల గురించి వివరించారు. సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అంశాలపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. అలాగే బాధ్యాతాయుత పౌరులుగా గుర్తింపు పొందేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, సిబ్బందిపాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా

- ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులకు పతకాల పంట

చోడవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన 10వ జాతీ యస్థాయి తైక్వాండో పోటీలలో ఉమ్మడి విశా ఖ జిల్లాకు చెందిన 31 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. తైక్వాండో, కొరుగి, పోమ్‌సే విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో చోడవరం, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు 12 మంది బంగారు పతకాలు, ఆరుగురు రజత పతకాలు. 13 మంది కాంస్య పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులకు కోచ్‌లుగా గండి శేఖర్ బాబు, చవల చంద్రశేఖర్, ప్రదీప్ కుమార్‌లు వ్యవహరించారు. విజేతలను రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ ప్రసాద్ అభినందించారని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన

కశింకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి నాయక ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు ఎలా జరుగుతాయో విద్యార్థులకు వివరించారు. అలాగే నమూనా ఓటు హక్కు కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.ప్రసాదరావు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఆయా ప్రాంగణాలకు వచ్చి నిరీక్షించే విధానాన్ని తెలిపారు. ఓటు హక్కుదారునికి ఎన్నికల కేంద్రంలో కల్పించబోయే ఏర్పాట్లను ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కరణం శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బ్యాలెట్ బాక్సును ఏ విధంగా తీసుకువస్తారో చూపుతున్న ఉపాధ్యాయులు

శారీరక పోషణపై...

కశింకోట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శారీరక పోషణపై ఎస్ఐ మనోజ్‌కుమార్, ఏఎస్ఐ రమణమ్మ అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులు, పోలీసులతో విద్యార్థులు ఎలా మాట్లాడాలో వివరించారు. అనంతరం శక్తి టీం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను తెలిపారు. ఎటువంటి అసౌకర్యం కలిగినా తమను సంప్రదించాలని సూచించారు.

గోప్యంగా దేవదాయ శాఖ భూముల వేలం పాట

- ముందస్తు సమాచారం లేకపోవడంతో గ్రామస్థుల ఆగ్రహం
- చేసేదేమీ లేక ప్రజల సమక్షంలో పాట వాయిదా

కశింకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కశింకోట వేణుగోపాల స్వామి ఆలయ భూములకు సంబంధించి శిస్తు నిమిత్తం మంగళవారం వేలం పాట గోప్యంగా నిర్వహించేందుకు ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కౌలు రైతులు, గ్రామస్థులు వేణుగోపాల స్వామి ఆలయం వద్దకు చేరుకొని ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా వేలంపాట ఎలా నిర్వహించారని ప్రశ్నించారు. కనీసం గ్రామంలో దండోరా కూడా వేయకుండా గోప్యంగా పాట నిర్వహించాల్సిన అవసరం ఏముందని వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు.

వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించి సుమారు 18.6 ఎకరాల భూమి ఉంది. సమయం పూర్తి కావడంతో మరలా పాత వ్యక్తులకే కట్టబెట్టాలనే ఆలోచనలో వేలం పాట నిర్వహిస్తున్నారని అక్కడకు వచ్చిన రైతులు వాపోయారు. కాగా రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వేలం పాటను వాయిదా వేశారు. తేదీ ఎప్పుడనే విషయంపై సంబంధిత సత్యనారాయణస్వామి దేవస్థానం ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి వివరణ కోసం పలుమార్లు ఫోను చేయగా, ఆయన స్పందించలేదు. ఇప్పుడైనా వేలం పాట విషయంపై రైతులకు, గ్రామస్థులకు సమాచారం ఇవ్వడానికి దండోరా వేయించాలని, ఆ తర్వాత ఉన్నతాధికారుల సమక్షంలో వేలం పాట నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.


వేణుగోపాలస్వామి ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

శాస్త్రోక్తంగా కుంకుమ పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సబ్బవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం శివారు గొర్లెవానిపాలెం గ్రామంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకొని కనకమహాలక్ష్మీ అమ్మవారికి శాస్త్రోక్తంగా కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు, మాజీ ఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రహదారి ధ్వంసం.. రాకపోకలు ప్రమాదకరం

- అధ్వానంగా తానాం-భరణికం రోడ్డు.. భయాందోళనలో వాహన చోదకులు

పరవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తానాం నుంచి భరణికం వెళ్లే ప్రధాన మార్గంలోని చెరువు సమీపంలో కల్వర్టు వద్ద ధ్వంసమైంది. భారీగా గోతులు ఏర్పడ్డాయి. కొంత కాలంగా ఈ రోడ్డు దుస్థితి ఇలాగే ఉన్నప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారు. కల్వర్టు వద్ద ఏర్పడిన గోతుల కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. ప్రధానంగా రాత్రుల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటున్నది. రహదారికిరువైపులా ముళ్ల పొదలు, చీకటిలో గోతులు గుర్తించలేని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గోతులను పూడ్చి వేసేందుకు అధికారులు తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని వాహన చోదకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.


కల్వర్టు వద్ద దెబ్బతిన్న తానాం-భరణికం రహదారి

చట్టాలపై అవగాహన అవసరం

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

కశింకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సూర్యలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికపై మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలల హక్కులు, చట్టాల రక్షణకు 11 మంది సభ్యులతో గ్రామ స్థాయి బాలల సంక్షేమ రక్షణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కమిటీ బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపుల నివారణ కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి కె.ఎల్.మనోహరరావు, ఐసీడీఎస్ అధికారి ప్రభావతి, డాక్టర్ తిరుపతిరావు, ఎస్ఐ మనోజ్‌కుమార్, ఏఎస్ఐ కె.రమణమ్మ, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, గ్రామ సర్పంచ్ ఎం.రజని తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పలకా కుటుంబం రాజీనామా


పలకా రవి

అనకాపల్లి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పదవులకు, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించిన పలకా రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో తన భార్య పలకా యశోద 84వ వార్డు కార్పొరేటర్‌గా పోటీ చేసినప్పటికీ దురదృష్టవశాత్తు ఓటమి పాలైందన్నారు. పార్టీ అధిష్ఠానం తమ సేవలను గుర్తించి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిందన్నారు. తమ కుటుంబానికి సహకరించిన వైసీపీ శ్రేణులకు, సన్నిహితులకు ధన్యవాదాలు తెలిపారు. వ్యక్తిగత అభిప్రాయం మేరకు తాను, కుటుంబం కలిసి రాజీనామా చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

సర్దుబాటు చార్జీల భారం మోపొద్దు

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం

పరవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపొద్దని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఇదే విషయమై మంగళవారం పరవాడ సంతలో ఐద్వా ప్రతినిధులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ నాయకులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. నాడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అంటూ పిలుపునిచ్చిన టీడీపీ శ్రేణులు, ఇప్పుడు స్వరం మార్చడం ప్రజలను మోసం చేయడమే అవుతుందని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లను బిగిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ప్రజలంతా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల ప్రతినిధులు ఎం.బంగారమ్మ, అన్నపూర్ణ, లక్ష్మీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్బవరంలో ఎమ్మెల్యే పర్యటన

సబ్బవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బుధవారం పర్యటిస్తారని జనసేన మండల కన్వీనర్ కర్రి కనకరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాయపుర అగ్రహారం, ఎజసిరస పల్లి, బంగారమ్మపాలెం, చినబంగారమ్మపాలెం, ఆరిపాక, పెదయాతపాలెం గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొనాలని కోరారు.

శివాలయానికి నాగాభరణం వితరణ

సబ్బవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శివాలయానికి నడిపల్లి రామరాజు దంపతులు మంగళవారం నాగాభరణాన్ని వితరణగా అందించారు. ఆలయ కమిటీ సభ్యులు డి.నాగేశ్వరరావు, ప్రకాశ్, బర్ల రమణ, కోరాడ శ్రీను, గొర్లె సత్యనారాయణ ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గెడ్డవాగుల ఆక్రమణలు పరిశీలన

సబ్బవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగలిపురం గ్రామంలో ఆక్రమణకు గురైన గెడ్డవాగులను తహశీల్దార్ బి.చిన్నికృష్ణ మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్లు 10, 67, 66లలో గెడ్డవాగులు ఆక్రమణకు గురవడంతో నేరేళ్ల చెరువుకు వరద నీరు పారడం లేదని ప్రజా ఫిర్యాదల పరిష్కార వేదికలో రైతులు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి న్యాయం చేస్తామని రైతులకు తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు తమరాన బంగారు నాయుడు, యడ్ల నాయుడు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించాలి

కశింకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ శునకాలు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలు, చిన్న పిల్లలపై దాడులకు పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కశింకోట హౌసింగ్ కాలనీలో బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయని గుర్తు చేశారు. ఈ సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే కుక్కల నియంత్రణకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

తుమ్మపాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కొండుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్థులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా మండల కోఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు మాట్లాడుతూ పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేశారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులంతా కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొండా ఉమా, నాయకులు శెట్టి వెంకట రమణ, జి.శ్రీరామ్, జి.బుజ్జి, ప్రసాద్ పాల్గొన్నారు.

తాను మోడువారినా.. మరో మొక్కకు ప్రాణాధారమై..


తాటి మోడులోనుంచి పెరుగుతున్న రావి మొక్క

కొయ్యూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీవకోటి మనుగడకు మొక్క లే ఆధారం. మనిషికి పరోకార సందేశాన్నిచ్చే లా ఇదిగో ఈ చెట్టు మోడుగా నిలిచినా మరో మొక్కకు ప్రాణదాతగా నిలుస్తోంది. స్థానిక శ్మశాన వాటికకు ఎదురుగా ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని ఉన్న పొలానికి రక్షణ కంచెగా ఏడాది కిందట తాటి చెట్టును నరికి దానిని దుంగలను పాతారు. ఇలా ఏర్పాటు చేసి ఓ తాటి దుంగలోంచి ఓ రావి మొక్క మొలిచి ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏపుగా పెరగడం ఆకట్టుకుంటోంది. సనాతన ధర్మంలో ప్రత్యేకత ఉన్న రావి చెట్టు తాటి మోడులోంచి మొలిచింది. దీంతో ఈ రావి చెట్టు పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు.

ముంచంగిపుట్టులోని పాఠశాలకు విద్యార్థులను తరలించవద్దని వినతి


ఏకలవ్య ప్రిన్సిపాల్‌కు వినతి పత్రమిస్తున్న తల్లిదండ్రులు

పెదబయలు. జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు మండలం లబ్బురు గ్రామ సమీపంలో అసంపూర్తిగా ఉన్న ఏకలవ్య పాఠశాల భవనాలలోకి తమ పిల్లలను ఇక్కడినుంచి తరలించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు పేరెంట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్‌కు వినతి పత్రాన్ని అందించారు. ముంచంగిపుట్టు మండలానికి చెందిన ఏకలవ్య పాఠశాల భవనాలను లబ్బురు గ్రామ సమీపంలో నిర్మిస్తున్నారు. నాలుగేళ్లయినా ఆ భవనాలు పూర్తికాకపోవడంతో పెదబయలు మండలం సీతగుంట పంచాయితీ కుమ్మరిపుట్టు వద్ద గల యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద పాఠశాలను కొనసాగిస్తున్నారు. అయితే, ఇటీవల జేసీ అభిషేక్ లబ్బురులో నిర్మాణ దశలో ఉన్న భవనాలను సందర్శించి ఆగస్టు నెల 15 వ తేదీ లోపు వైటీసీలో ఉన్న విద్యార్థులను లబ్బురుకు తరలిస్తామని ప్రకటించారు. అయితే, కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మాణం జరగని ఆ భవనాలలో తమ పిల్లలను తరలిస్తే వారికి రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టిన తరువాతనే తమ పిల్లలను లబ్బురు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కృష్ణబాబు, నూకరాజు, వైకుంఠం పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మ రక్షణపై శిక్షణ


ఏకలవ్య ప్రిన్సిపాల్‌కు వినతి పత్రమిస్తున్న తల్లిదండ్రులు

పాడేరురూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాడేరు సెయింటాన్స్ స్కూల్లో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ తరగతులను మంగళవా రం ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ మరియానా తెలిపారు. ఇంటర్నేషన ల్ కోఫుకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినార్ బాకూరు పాండురాజు ఆధ్వర్యంలో కరాటే శిక్షణ అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అన్నమేరి, మోనిక, పీడీలు గణేశ్, పరశురామ్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

7న జెన్‌కో కార్మికుల 'చలో విజయవాడ'



సీలేరులో జెన్‌కో సివిల్ ఈఈ కార్యాలయం ఎదుట పోస్టర్లు ప్రదర్శిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, నాయకులు

సీలేరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో సీఐటీయూ ఆధ్వర్యంలో జెన్‌కో కాంట్రాక్టు కార్మికు లు మంగళవారం స్థానిక జెన్‌కో ఈఈ (సివిల్) కార్యాల యం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పని చేస్తున్న వేలాది మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆగస్టు 7న చేపట్టనున్న విజయవాడ విద్యుత్ సౌధా ముట్టడికి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా స్థానిక సీఐటీయూ నాయకులు పి లుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు బి లక్ష్మణ రావు, కార్యదర్శి టి. విష్ణుకుమార్‌రాజు ఇతర కార్యదర్గ సభ్యులు పాల్గొన్నారు.

అరకు క్రీడా పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

- రెండు నెలల వ్యవధిలో సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు
- శాప్ డైరెక్టర్ జగదీశ్వరి


క్రీడా మైదానంలో విల్లు ఎక్కుపెడుతున్న శాప్ డైరెక్టర్ జగదీశ్వరి, ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అరకులోయ గురుకుల క్రీడా పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని శాప్ డైరెక్టర్ జగదీశ్వరి తెలిపారు. మంగళవారం క్రీడా పాఠశాలను టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొరతో కలిసి సందర్శించారు. ప్రస్తుతం ఐటీడీఏ యూత్‌ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభమైన ఈ పాఠశాల తొలుతనుంచి అరకొరసౌకర్యాల మధ్య కొనసాగుతున్నట్టు ప్రిన్సిపాల్ పీఎస్‌ఎన్ మూర్తి ఈ సందర్భంగా వివరించారు. సరైన క్రీడా మైదానం లేదని, ఉన్నంతలో క్రీడాకారులకు కోచ్‌లు తగిన విధంగా శిక్షణ అందిస్తూ ఈవెంట్స్‌కు పంపుతున్నట్టు తెలిపారు. తొలుతలో మంజూరైన నిధులు సొంతస్థలం లేక పోవడంతో వెనక్కి వెళ్లిపోయినట్టు ప్రిన్సిపాల్ వివరించారు. రెండేళ్ల క్రితం ప్రభుత్వం క్రీడా పాఠశాలకు అంజోడ వద్ద స్థలాన్ని కేటాయించారని వివరించారు. ఈ సందర్భంగా శాప్ డైరెక్టర్ ప్రస్తుత పాఠశాలను, మైదానాన్ని పరిశీలించారు. పాఠశాలకు అవసరమైన స్థలం మంజూరైనందున పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రం విడిపోయిన ఏ డాదిలో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అరకులో క్రీడాపాఠశాలను మంజూరు చేసినట్టు గుర్తు చేశారు ప్రస్తుతం తిరిగి ముఖ్యమంత్రి, ఐటీ శాఖా మంత్రి లోకేశ్, శాప్ చైర్మన్ ఇప్పటికే ఈ క్రీడాపాఠశాల విషయం చర్చించారన్నారు. త్వరలో శాప్ బోర్డుమీటింగ్‌లో అవసరమైన నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన సంక్షేమశాఖనుంచి నిధుల మంజూరుకు ప్రయత్నిస్తామన్నారు. మరో రెండు నెలల వ్యవధిలో పాఠశాల నిర్మాణాలు ప్రారంభించేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ క్రీడాకారులకు వసతులు సమకూరిస్తే మరింత ఫలితాలు క్రీడాకారులు సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా మైదానంలో విల్లు బాణాలతో వారు షూట్‌చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాక్రీడాభివృధి అధి కారి జగన్నాథం, టీడీపీ నాయకులు ఉన్నారు.

బంగారు కుటుంబాల అభివృద్ధికి తోడ్పాటు

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ డాక్టర్.ఎంజే అభిషేక్ గౌడ


బంగారు కుటుంబంతో అభిషేక్ గౌడ

పాడేరురూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అ మలు చేస్తున్న పీ4 పథకంలో ఎంపిక బంగారు కుటుంబాల అభివృద్ధికి దోహదపడతామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ అన్నారు. పెదబయలు మండలం పొయిపల్లి పంచాయతీ సైలంకోట గ్రామానికి చెందిన భార్య, కుమార్తె, ఇద్దరు మగపిల్లలు ఉన్న జ ర్సింగి తెల్లన్న బంగారు కుటుంబాన్ని జేసీ దత్తత తీసుకున్నారు. తెల్లన్న కుమార్తె రమాదేవి సూపర్ 50కి ఎంపికై ప్రస్తుతం మారికవలస కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం జేసీ క్యాంప్ కార్యాలయంలో దత్తత ఈ కుటుంబంతో ఆయన సమావేశమయ్యారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. 2023లో కాఫీ తోట పెంపకం చేపట్టామని తెల్లన్న ఆయనకు వివరించారు. రమాదేవిని ఉన్నత చదువులు చదించాలని, అందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తానన్నారు. సేద్యానికి సాయమందిస్తామన్నారు. ఆయన గ్రామంలో ఉన్న నీటి వనరుల ను అడిగితెలుసుకున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు తలారిసింగి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాడేరురూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థులను ఏటీడబ్ల్యూవో అఖిల, పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది అభినందించారు. ఈ నెల 28వ తేదీ సోమవారం విశాఖలోని ఆంధ్రాయూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ అండర్- 16 విభాగంలో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జి.చంద్రశేఖర్‌నాయుడు షాట్ పుట్‌లో ప్రథమ స్థానం, జావెలెన్ త్రో లో ద్వితీయ స్థానం సాధించి ఆగస్టు 9, 10, 11వ తేదీలలో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. 10వ తరగతి చదువుతున్న జి.రామ్‌చరణ్ అండర్-16 విభాగంలో ట్రైథ్‌లాన్ 60 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, త్రోబాల్ విభాగాల్లో ప్రథమ స్థానం సాధించారు. మంగళవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఘనంగా సత్కరించి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పాత కాఫీ తోటలు పునరుద్ధరణ

- ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు ఏడీ బొంజుబాబు


కాఫీ రైతులతో మాట్లాడుతున్న ఏడీ బొంజుబాబు

చింతపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పాత కాఫీ తోటలు పునరుద్ధరణ చేపడుతున్నట్టు ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు ఏడీ బొంజుబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తపాలెం పంచాయతీ రామ్‌నగర్ కాలనీలో కాఫీ తోటల్లో మొక్కల నాట్లు పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ రైతులు 2.56ఎకరాల్లో కాఫీ పంటను సాగు చేస్తున్నారన్నారు. గిరిజన రైతులు పాత తోటల్లో వివిధ కారణాల వల్ల కొన్ని మొక్కలు చనిపోయాయన్నారు. దీంతో తోటల్లో మొక్కల ఖాళీలు ఏర్పాడ్డాయన్నారు. తోటల్లో పూర్తి స్థాయిలో మొక్కలు లేక వల్ల దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కాఫీ తోటల పునరుద్ధరణకు ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. పాత కాఫీ తోటలను పునరుద్ధరించేందుకు పాడేరు డివిజన్ పరిధిలో 234 కాఫీ నర్సరీలను అభివృద్ధి చేశామన్నారు. ఈనర్సరీల నుంచి ఎకరానికి 450 మొక్కలు చొప్పున రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. గిరిజన రైతులు పాత తోటల్లో ఈ మొక్కలు నాటు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ధర్మరాయ్, ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వేసుబాబు, లైజన్ వర్కర్లు చంటిబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఎస్‌ఐ


మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటరమణ

చింతపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్‌ఐ వెంకట రమణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో యువకులు, ప్రైవేట్ వాహనాల డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంతో ద్విచక్రవాహనదారులు పరిమితికి మించిన వేగంతో ప్రయాణిస్తుండడం వల్ల ప్రమాదాలు చోటుసుకుంటున్నట్టు చెప్పారు. అనేమంది మృత్యువాతపడుతున్నారన్నారు. బైక్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

స.హ. చట్టంపై అవగాహన అవసరం

పాడేరురూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం పై ప్రతీ పౌరునికి అవగాహన అసరమని డీపీఎం ఎస్‌జేవీ రామ్మోహన్‌రావు అన్నారు. ఆర్‌టీఐ యాక్ట్‌పై మంగళవారం ఆయన ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలలో అవసరమైన సమాచారాన్ని కోరితే 30 రోజుల్లోగా అందించాలన్నారు. ఈ సదస్సులో అడిషనల్ డీఎం ఎల్.భాస్కరరావు, ఎస్‌ఎఫ్‌ఏలు, ఎంటీలు, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వరుస వరి నాట్లతో మేలు: ఏడీఏ


రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ తిరుమలరావు

చింతపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వరి నాట్లు వరుసల పద్ధతిలో వేసుకోవాలని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) టీవీ తిరుమలరావు అన్నారు. మంగళవారం మండలంలోని లబ్బంగి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీఏ మాట్లాడుతూ రైతులు వరి నాట్లు వేసుకోవడంలో మెలకువల పాటించాలన్నారు. నారు పిలకలను తుంచుకుని నాట్లు వేసుకోవాలన్నారు. నారుని జీవామృతంలో ముంచి పలుచగా ఒకటి, రెండు మొక్కలను నాట్లు వేసుకోవాలన్నారు. రైతులు వరుసల పద్ధతిలో నాట్లు వేసుకోవడం వల్ల మొక్కలకు గాలి, వెలుతురు అందుతుందని, కలుపు నివారణ సులభంగా ఉంటుందన్నారు. వరి, రాగి, కొర్ర, సామ పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలోనే సాగు చేసుకోవాలన్నారు. రైతులకు ఉద్యాన, వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయిలో సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదనరావు, అత్మ ఏటీఎం మహేశ్వరి, వీహెచ్‌ఏ చంద్రకళ పాల్గొన్నారు.

పీ4పై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం

- విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర


అరకులోయలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దొన్నుదొర, శాప్ డైరెక్టర్ జగదీశ్వరి, టీడీపీ నాయకులు

అరకులోయ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలు అదేస్థితిలో అణగారి ఉండాలనే ఉద్దేశంలోనే వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు పీ4 పథకంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర ఆరోపించారు. పేదరికం లేని రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు ఆటంకాలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. పేదలు అణగారి ఉంటేనే వారి మాటలు చెల్లుబాటు అవుతాయని ఆలోచనలు చేస్తున్నారన్నారు. పీ4లో ఎవరిని బలవంతం చేయడంలేదని, ఎవరికి వారు స్వచ్ఛందంగా దత్తత తీసుకుంటున్నారన్నారు. అరకులోయ పట్టణంలో మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు లకోయ్ మహాదేవ్ ఆధ్వర్యంలో పెదలబుడు సర్పం చ్ పెట్టెలి దాసుబాబు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంచేపట్టారు. శాప్ డైరెక్టర్ జగదీశ్వరి, ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు విజయ్‌నాయక్ తదితరులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. రైతులకు అగస్టు 2 న అన్నదాత సుఖీభవ, 15 నుంచి మహిళలకు ఉచితబస్సు ప్రయాణం పథకాలు అమలులోకి వస్తాయని వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి పాంగి రాజు, నాయకులు పెట్టెలి రాము, నాగరాజు, కామరాజు, లక్ష్మీకాంత్, కిల్లో మోహన్ , బొడ్డుశ్యాం, శంకరనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మంగళ గౌరీ ప్రత్యేక పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పాడేరురూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ దేవాలయాలు శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా భక్తులతో కళకళలాడాయి. పూర్ణపుష్కల అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న మహాలక్ష్మి మంగళ గౌరిగా దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే, ఉమానీలకంఠేశ్వరస్వామిలో ఆలయంలో మహాలక్ష్మికి కుంకుమ పూజలు చేపట్టారు. మోదకొండమ్మ, కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాలను భక్తులు దర్శించి ప్రత్యేక పూజలను చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


జ్వరంతో బాధపడుతున్న బాలుడిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

గూడెంకొత్తవీధి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు సీజనల్ వ్యా.దులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌వీనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి రవీంద్రనాథ్ చౌదరి అన్నారు. మంగళవారం టంగులగొందిలో గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నట్టు స్థానిక ఆశ కార్యకర్త సమాచారం ఇవ్వడం తో వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 96మందికి సాధారణ ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. 15 మంది జ్వర బాధితులు రక్త పరీక్షలు నిర్వహించారు. ఏ ఒకరిలో మలేరియా నమోదు నిర్ధారణకాలేదు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ నెహ్రూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యా ధికారి మాట్లాడుతూ వాతావరణంలో మార్పు వల్ల జ్వరాలు, దగ్గు, జలుబు, అతిసార ప్రబలే అవకాశం ఉందన్నారు. వేడి ఆహారం తీసుకోవాలన్నారు. కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి


రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నేత రామ్మూర్తి

ముంచంగిపుట్టు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్టు టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డంగి రామ్మూర్తి అన్నారు. మండలంలోని జర్జుల పంచాయతీ బలడ గ్రామ సమీపంలో పీఆర్ రోడ్డు నుంచి సిరగంపుట్టు మీదుగా మర్రిపుట్టు గ్రామం వరకు పీఎం జన్మన్ నిధులు సుమారు రూ. కోటి 80లక్షలతో చేపడతున్న రహదారి పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. నాణ్యతతో పూర్తిచేయాలని కాంట్రాక్టర్ రామ్మూర్తికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉప కార్యదర్శి బి.రామారావు, పెసా అధ్యక్షులు కె.తిలక్, పాల్గొన్నారు.

లింపి స్కిన్ నివారణకు టీకాలు

పెదబయలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలం రూఢకోట పంచాయతీలో మూగజీవాలకు లింపి స్కిన్ నివారణకు వ్యాధినిరోధక టీకాలను మంగళవారం పశువైద్య సిబ్బంది వేశారు. గ్రామం లో 22 పశువులకు, 30 మేకలకు ఈ టీకాలు పూర్తిచేసినట్టు ఇన్‌చార్జి లైవ్ స్టాక్ అసిస్టెంట్ అధికారిణి వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన సదస్సు రేపు

పాడేరురూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇస్రో భాగస్వామ్యంతో అంతరిక్షవిజ్ఞానపై జిల్లా సాయి అవగాహన సదస్సును ఈ నెల 31వ తేదీ ఉదయం 9.30 గంటలకు పాడేరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల (తలారిసింగి)లో ప్రారంభించనున్నట్టు డీఈవో పి. బ్రహ్మాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ సిటీ ఆఫ్ అమరావతి, సమగ్రశిక్ష ఏపీ ఎడ్యుకేషన్,ముస్కాన్ ఫౌండేషన్ సంస్థల సహకారంతో ఈ స్పేస్ స్కిల్ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇస్రో ప్రయోగాలు, ఉపగ్రహాలు, అంతరిక్ష ప్రయోగాలపై వినూత్న ప్రదర్శనలు స్పేస్, మోడల్స్, విజువల్ డెయోస్, వీడియో ప్రజెంటేషన్, శాస్త్రజ్ఞుల ఇంటరాక్షనేషన్స్, కెరీర్‌పై సైన్స్ సిటీ నుంచి రిసోర్స్‌పెర్సన్లుప్రత్యేక ఉపన్యాసాలుంటాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపయోగ పడుతుందని జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు అభిప్రాయం వ్యక్తం చేశారు.

పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతి పాటించాలి

- డీఏహెచ్‌వో వేణుమాధవ్


హాస్టల్ నిర్వాహణపై మాట్లాడుతున్న డీఏహెచ్‌వో

పాడేరురూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పశువులను యాజమాన్య పద్ధతిలో పెంచాలని లగిశపల్లి పశువుల హాస్టల్ నిర్వహణ రైతులకు జిల్లా పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.వేణుమాధవ్ సూచించారు. మండలంలోని లగిశపల్లిలో ఏర్పాటుచేసిన పశువుల హాస్టల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. పశువులకు రోజుకు 30 కిలోల పచ్చిగడ్డి, 2 కిలోల ఎండు గడ్డి, 4 కిలోల దాణాను అందిస్తే పశువు ఆరోగ్యంగా ఉంటూ మంచి పాల దిగుబడిని ఇస్తుందని సూచించారు. ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందిస్తున్న పశు దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లగిశపల్లి పశువుల హాస్టల్‌కి సరిపడే పచ్చి గడ్డి పెంపకానికి నీటి సదుపాయం గల ఐదెకరాల భూమిని ఎం పిక చేయాలని వెలుగు ఏపీఎంను కోరారు. ప్ర స్తుతం సజ్జా జాతి గడ్డి విత్తనాలుస్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నా య ని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు బి.రవి, కె.సురేశ్, ఏపీఎంచిన్నారావు, సచివాలయ సి బ్బంది, ఏహెచ్‌ఏ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి: అసిస్టెంట్ కలెక్టర్ షాహిత్



కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ షాహిత్

అరకులోయ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ షాహిత్ అన్నారు. మంగళవారం ఎండపల్లివలస ఈఎంఆర్‌ఎస్, కేజీబీవీ పాఠశాలల్లో జరిగిన టీచర్స్ లీడర్‌షిప్ ట్రైనింగ్ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు, ప్రభుత్వ పాఠశాలలకు పెద్ద వ్యత్యాసం ఏమీ లేదన్నారు. తాను 15 నుంచి 17 రాష్ట్రాల్లో ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలను సందర్శించినట్టు చెప్పారు. గతంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్లో రెండు సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించినట్టు తెలిపారు. ప్రతీ చోటా విద్యార్థుల అభ్యసనా విధానం ఒకేలా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి నాణ్యమైన విద్యా బోధన చేయాలని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా మరింత నైపుణ్యంను ఎప్పటికప్పుడు పెంచుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థుల విద్యాప్రమాణాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ డాక్టర్ స్వామినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం: సీఐ


మాట్లాడుతున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తేనే భవిష్యత్తుకు పునాదిగా ఉంటుందని అరకు సీఐ హిమగిరి పేర్కొన్నారు. మండలంలోని మారుమూల నందివలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే, పోక్సో, బాల్య వివాహాల నిషేధ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సరోమా, వార్డెన్ కళావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి'

అనంతగిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులను వెంటనే రద్దుచేయాలని జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురికుట్టి 1200 మెగావాట్లు, కరివలస వెయ్యి మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులు రద్దుచేయడం సంతోషకరమని, అలాగే, అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని పెదకోట రేగులపాలెం, గుమ్మకోట గుజ్జెలి, టోకూరు చిట్టంపాడు వద్ద ఈ ప్రాజెక్టులకు సంబంధించి అనుమతులు రద్దుచేసి, గిరిజనుల మనో భావాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలోటోకూరు సర్పంచ్ మోస్య, నాయకులు నాగులు, దేవన్న, బుద్రయ్య, భీమరాజు, భీమన్న పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా

▸▸ ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులకు పతకాల పంట

చోడవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన 10వ జాతీ యస్థాయి తైక్వాండో పోటీలలో ఉమ్మడి విశా ఖ జిల్లాకు చెందిన 31 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. తైక్వాండో, కొరుగి, పోమ్‌సే విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో చోడవరం, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు 12 మంది బంగారు పతకాలు, ఆరుగురు రజత పతకాలు. 13 మంది కాంస్య పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులకు కోచ్‌లుగా గండి శేఖర్ బాబు, చవల చంద్రశేఖర్, ప్రదీప్ కుమార్‌లు వ్యవహరించారు. విజేతలను రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ ప్రసాద్ అభినందించారని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు.

జాతీయ స్థాయి బోసి బాల్ పోటీల్లో ప్రతిభ

▸▸ నాలుగో స్థానం దక్కించుకున్న బాల సరస్వతి


పతకం, సర్టిఫికెట్‌తో బాల సరస్వతి

రావికమతం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఒలింపిక్ భారత్ జాతీయ స్థాయిలో నిర్వహించిన బోసి బాల్ పోటీల్లో మండలంలోని కొమిర గ్రామానికి చెందిన మనోవైకల్య విద్యార్థిని నక్కరాజు బాల సరస్వతి నాలుగో స్థానం దక్కించుకుంది. ఈ నెల 24 నుంచి 28 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో 24 రాష్ట్రాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఏపీ రాష్ట్ర సమగ్ర శిక్ష ఆదేశాలతో ఆంధ్రా నుంచి ఆరుగురు దివ్యాంగ క్రీడాకారులు ఈ పోటీలకు ఎంపికయ్యారు. రావికమతం మండలం మేడివాడ జడ్పీ పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడును కోచ్‌గా నియమించి ఈ ఆరుగురు క్రీడాకారుల బాధ్యతను అప్పగించారు. మహాలక్ష్మినాయుడు రాష్ట్రం తరఫున పోటీ చేసే క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. వీరిలో ఒకరు బంగారు పతకం, ఇద్దరు రజత పతకం, మరొకరు కాంస్య పతకం సాధించారు. వీరితో పాటు మండలానికి చెందిన బాల సరస్వతి నాలుగో స్థానం దక్కించుకుని ప్రశంసాపత్రం అందుకుంది.

ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దు

▸▸ తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ

నాతవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అధికారులు కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తించవద్దని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ కోరారు. మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపులో జాప్యానికి గల కారణాలు ఓర్పుతో చెప్పాలన్నారు. గన్నవరం పీఏసీఎస్ చైర్మన్ సింగంపల్లి సన్యాసిదేముడు మాట్లాడుతూ గన్నవరం సచివాలయంలో సిబ్బంది లేరని, వెంటనే పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఉషశ్రీ, మండల పరిషత్ పరిపాలనాధికారి పి.పార్థసారథి, ఏపీవో కొండాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధి యూనిట్లకే రుణాలు

▸▸ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి


వెలుగు కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

రావికమతం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల జీవనోపాధి యూనిట్లకు మాత్రమే రుణాలు మంజూరు చేయాలని సెర్ప్ ఆదేశాలు జారీ చేసిందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు ఇకపై పాడి గేదెలు, ఆవులు, వివిధ రకాల దుకాణాలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే సెర్ఫ్ కోయంబత్తూర్‌కు చెందిన పెరియాగళం హార్టికల్చరల్‌తో మునగాకు సేకరణకు.. గేట్‌హౌస్‌తో టీ,కాఫీ స్టాల్స్ ఏర్పాటుకు.., కొరమీను,సముద్రపు నాచు సేకరణకు ఉదయ్ ఆక్వాతోనూ, చిరుధాన్యాలు, వెదురు పెంపకానికి కంపెనీలతో ఎంఒయూలు కుదుర్చుకుందన్నారు. జిల్లాలో డ్వాక్రా గ్రూపు సభ్యులు వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్త్రీనిధి రుణాలు వసూలులో అవకతవకలకు చెక్ పెట్టేందుకు కొత్తగా ప్రభుత్వం ఒక యాప్‌ను తీసుకొస్తుందన్నారు. అతి త్వరలోనే దీనిని లాంచ్ చేయబోతున్నామని ఆమె చెప్పారు. మండలంలో టి.అర్జాపురం సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది, పంచాయతీ కార్యదర్శితో ఆమె సమావేశమయ్యారు. టి.అర్జాపురంలో పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులను అవమానించారని ఐవీఆర్‌ఎస్‌కు లబ్ధిదారులు ఫిర్యాదు చేశారన్నారు. ఇటువంటి ఫిర్యాదులు పునరావృతం కాకుండా పనిచేయాలని ఆమె సూచించారు.

జి.కోడూరులో నల్లరాయి తవ్వకాలు ఆపండి

బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్కా పరంజ్యోతి

దళితుల నిరసనలకు మద్దతు.. సీపీఐ నేతలతో క్వారీ సందర్శన


జి.కోడూరు నల్లరాయి క్వారీని పరిశీలిస్తున్న పరంజ్యోతి, సీపీఐ నాయకులు

నర్సీపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలంలోని జి.కోడూరులో నల్ల రాయి తవ్వకాలు ఆపాలని బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్కా పరంజ్యోతి డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా దళిత రైతులు చేస్తున్న ధర్నాకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. నల్ల రాయి క్వారీ కారణంగా పరిసర ప్రాంతాల్లోని 200 ఎకరాల్లో పొలాలు పాడవుతున్నాయన్నారు. ఏడు రోజులుగా సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఆయన వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొట్టా నాగరాజు, కాంగ్రెస్ నేత బొంతురమణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

జి.కోడూరులో క్వారీ సందర్శన

మాకవరపాలెం: జి.కోడూరు గ్రామంలో దళత రైతుల భూములను అనుకొని ఉన్న నల్లరాయి క్వారీని బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పరంజ్యోతి, సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ అక్రమ మైనింగ్ వల్ల పచ్చటి పంట పొలాలను నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్ల పేల్చుతుండడంతో పొలాల్లోకి వచ్చిపడుతున్నాయన్నారు. రైతుల భూముల్లో పెత్తందారులు పెత్తనం చేయడం సరికాదన్నారు. తక్షణమే దళిత రైతుల భూములను ఆనుకొని ఉన్న రాళ్ల క్వారీని రద్దు చేసి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుబాబు, ఫణీంద్రకుమార్, రాధాకృష్ణ, దళిత రైతులు పాల్గొన్నారు.

ల్యాండ్ సీలింగ్ భూములపై విచారణ


మాకవరపాలెంలో పీజీఆర్‌ఎస్ ఫిర్యాదుపై విచారణ చేస్తున్న తహశీల్దార్

మాకవరపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ సీలింగ్ భూములపై విచారణ చేపడుతున్నామని తహశీల్దార్ వెంకటరమణ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం మాకవరపాలెం బీసీ కాలనికీ ఆనుకుని ఉన్న సీలింగ్ భూమిలో విచారణ చేపట్టారు. ఇటీవల గ్రామానికి చెందిన లాలం రాము, రుత్తలనాని సుమారు 4.6 ఎకరాల సీలింగ్ ల్యాండ్ భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో భూమి వద్దకు వెళ్లి వివచారణ చేశామన్నారు. ఈ భూమి 47/ఎ, 47/బి, 47/సి, 47/డి సర్వే నంబరల్లో సుమారు 4.6 ఎకరాలు చేవ్వేటి రాజుమ్మ, నూకరాజు, గెంజి అప్పన్న, రుత్తల రామయ్యమ్మ పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదై ఉందని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులు ఉంటే కార్యాలయానికి అందజేయాలని ఆక్రమణ దారులకు తహశీల్దార్ హెచ్చరించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సూరిబాబు పాల్గొన్నారు.

వడ్డాది జూనియర్ కాలేజీలో రెండు ఒకేషనల్ కోర్సులు

ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం

ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



చోడవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలం వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెండు ఒకేషనల్ కోర్సులు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. వడ్డాది కాలేజీలో ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్, టెక్నీషియన్ కోర్సుతో పాటు. ఎంపీ హెచ్ఎ(ఉమన్) ఒకేషనల్ కోర్సులకు అనుమతి ఇస్తూ ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ వృత్తి విద్యా కోర్సులు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం కానున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ కోర్సులు వల్ల ఎంతో ప్రయోజనం కలుగుందని ఎమ్మెల్యే రాజు వివరించారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

దేవరాపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డేపల్లి హేమంత్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అధికారి సీహెచ్ భువన మాధురీతో మాట్లాడారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సందర్శించినట్టు వైసీపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, లలితానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా రేపు

నర్సీపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఎల్ఏఎస్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చైర్మన్ మీసాల సుబ్బన్న తెలిపారు. ఫార్మా, ఐటీ కంపెనీలలో సుమారు 1500 ఖాళీలు భర్తీ చేయడానికి ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోకోహమా, డిఫిక్రాఫ్టర్స్ (ఐటీ), అల్ట్రాస్ట్ టెక్నాలజీస్, అమ్కుర్ట్ టెక్నాలజీస్, భారత్ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, అపోలో ఫార్మసీ కంపెనీలు మేళా పాల్గొంటున్నాయని ఆయన తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అచ్యుతాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం సాయంత్రం కొండకర్ల వద్ద పట్టుకున్నట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. కె.కోటపాడు మండలం చౌడువాడ వద్ద శారదా నది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో లోడింగ్ చేసి, అనుమతులు లేకుండా అచ్యుతాపురం మండలం కొండకర్లకు అక్రమంగా రవాణా చేస్తున్నట్టు చెప్పారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దారుకు అప్పగించామని సీఐ తెలిపారు.

ఎరువుల కోసం రైతు కేంద్రాలు కిటకిట


ఎరువులకు ఎగబడుతున్న రైతులు

బుచ్చెయ్యపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది రైతు సేవా కేంద్రం మంగళవారం రైతులతో కిటకిటలాడింది. ఎరువుల కోసం రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. యూరియా, డీఏపీ సబ్సిడీపై ప్రభుత్వం విక్రయిస్తున్నది. యూరియా రూ.270 కాగా.. డీఏపీ రూ.1,360 రైతులకు అందిస్తున్నారు. రైతు సేవా కేంద్రంలో 517 బస్తాల యూరియా అందుబాటులో ఉందని అగ్రికల్చర్ అధికారి శ్రీసాయిలక్ష్మి తెలిపారు.

సమాజాభివృద్ధికి పాత్రికేయులు కృషిచేయాలి

▸▸ ఎంపీపీ రెడ్డి జగన్మోహన్

కె.కోటపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి పాత్రికేయులు కృషి ఎంతో అవసరమని స్థానిక ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో ఏపీయూడబ్ల్యూజే చోడవరం ప్రెస్‌క్లబ్ సమావేశం నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీవీఎం నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమ నిధికి రూ.25వేలు విరాళంగా ఇస్తానని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పాత్రికేయ కుటుంబాలకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ మాట్లాడుతూ పాత్రికేయులు సమాజంలో జరిగే మంచి చెడులను గుర్తించి వార్తలు అందించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన బీఎల్ఎన్ స్వామిని స్థానిక నాయకులు, అధికారులు, పాత్రికేయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భుజంగరావు, అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, ఏ. కోడూరు, కె.కోటపాడు ఎస్ఐలు లక్ష్మీనారాయణ, ధనుంజయ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగినాయుడు, కోరాడ చంద్రరావు, చోడవరం ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నేమాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఏడాదిలోనే సంక్షేమ పథకాల అమలు'

రోలుగుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే అన్ని సంక్షేమ పథకాలకు సీఎం చంద్రబాబునాయుడు అమలు చేశారని రోలుగుంట ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం రోలుగుంటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, మూడు సిలిండర్లు, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేనివారు దరఖాస్తు చేసుకుంటే అర్హత కలిగిన వారందరికీ మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం: ఐసీడీఎస్ పీడీ

కశింకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికపై మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలల హక్కులు, చట్టాల రక్షణకు 11 మంది సభ్యులతో గ్రామ స్థాయి బాలల సంక్షేమ రక్షణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాలల రక్షణ అధికారి మనోహరరావు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీల నియామకం

నాలుగు మండలాల జాబితాలను ప్రకటించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పరిశీలకుడు ఏసుదాసు


రొంగలి మహేష్, అధ్యక్షుడు, కె.కోటపాడు


నందారపు సన్యాసిరావు, అధ్యక్షుడు, మాడుగుల


పుప్పాల రమేష్, కార్యదర్శి, మాడుగుల


కార్యవర్గాలను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే బండారు, పరిశీలకుడు ఏసుదాసు

దేవరాపల్లి/కె.కోటపాడు/మాడుగుల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నూతనంగా మండల కార్యవర్గాలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పార్టీ పరిశీలకులు వై.ఏసుదాసు మంగళవారం ప్రకటించారు. రైవాడ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఒకరిని రాష్ట్ర కమిటీలో నియమిస్తున్నట్టు చెప్పారు. అలాగే ప్రతి మండల కమిటీలో ఆరుగురు సభ్యులు ఉండేలా ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇద్దరు మహిళలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరికి చెందిన వారిని గుర్తిస్తామన్నారు. కె.కోటపాడు మండల అధ్యక్షుడిగా రొంగలి మహేష్, కార్యదర్శిగా జూరెడ్డి రాము, క్లస్టర్ ఇన్‌చార్జిగా సూర్యనారాయణ, కో-క్లస్టర్ ఇన్‌చార్జిగా నారాయణరావు, పైడంనాయుడు, బోజంకి మహేశ్వరీ నియమితులయ్యారు. చీడికాడ అధ్యక్ష, కార్యదర్శులుగా పోతల చిన్నంనాయుడు, పంచాడ దాలినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా గణేష్, కో-క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా నానాజీ వ్యవహరిస్తారన్నారు.

మాడుగుల మండల అధ్యక్షుడిగా నందారపు సన్యాసిరావు, పుప్పాల.రమేశ్, క్లస్టర్ 1 ఇన్‌చార్జ్‌గా మజ్జి లక్ష్మణరావు, ఇన్‌చార్జ్ కో-ఇన్‌చార్జ్‌గా బి.విజయలక్ష్మి, క్లస్టర్-3కి వి.రాజ్‌కుమార్ నియమితులయ్యారు. మిగతా క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను త్వరలో ఖరారు చేస్తామన్నారు. దేవరాపల్లి మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులుగా పెద్దాడ వెంకటరమణ, దొగ్గనాయుడు, క్లస్టర్-6 ఇన్‌చార్జిగా చామంతుల వెంకన్నదొర, కో-కన్వీనర్‌గా మొల్లి కృష్ణమూర్తి నియమించినట్టు వారు తెలిపారు.

'వరి నారుమళ్లకు తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు అవసరం'

చోడవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరి నారుమళ్లకు తెగుళ్ల సోకకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఈ. పావని రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని దుడ్డుపాలెం, గంధవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నారుమళ్లపై రైతులకు సూచనలు ఇచ్చారు. నారుమళ్లకు తెగుళ్ల సోకినట్టు గుర్తించినట్టయితే బస్తా విత్తనం గల నారుమడికి కేజీ కార్బొఫ్యూరాన్ త్రీజీ గుళికలు వేసుకోవడం ద్వారా నారుకు మొవ్వుపోటు ఆశించకుండా చూసుకోవచ్చని తెలిపారు. ఆర్జీఎల్, సాంబమసూరి వంటి రకాలు సాగు చేసే రైతులు వరి నారు అక్కడక్కడా కుళ్లినట్టు లేదా ఎండినట్టు గమనించినట్టయితే, హెక్సాకొనజోల్ మందు 2 ఎంఎల్, లీటరు నీటికి కలిపి నారు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. ఇలా వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయడం ద్వారా ఈ తెగులు లేకుండా చూసుకోవచ్చన్నారు. నారుమడుల్లో కలుపు నివారణకు బిస్పైరీ బ్యాక్ సోడియం మందు ట్యాంకు నీటికి 10 ఎం ఎల్ కలిపి పిచికారీ చేస్తే కలుపు సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. గడ్డిమందు కొట్టేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేలో అభ్యంతరాలుంటే తెలపండి

తహశీల్దార్ అంబేడ్కర్


దొండపూడి గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ అంబేడ్కర్

రావికమతం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):భూముల రీ సర్వేలో లోపాలుంటే రైతులు వెంటనే తెలియజేయాలని తహశీల్దార్ అంబేడ్కర్ అన్నారు. మంగళవారం దొండపూడిలో తహశీల్దార్ ఆధ్వర్యంలో రీసర్వే అభ్యంతరాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ పరిధిలో 1,988 మంది రైతులకు చెందిన 2,331ఎకరాల 874 సెంట్లు భూములకు 2025 జనవరి 24 నుంచి నిర్వహించిన భూ రీ సర్వే వివరాల జాబితాను చదివి వినిపించారు. దీనిపై రైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే సభాముఖంగాని, వ్యక్తిగతంగాని తెలియజేయాలని తహశీల్దార్ కోరారు. అలాగే ఇప్పటికే రీసర్వే జరిపిన జాబితాను 13 నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, దీనిపై 14 రోజుల వ్యవధిలో అభ్యంతరాలుంటే తెలియపరుచుకోవచ్చునన్నారు. ఈగ్రామసభలో రైతుల నుంచి ఏ విధమైన అభ్యంతరాలు రాకపోవడంతో ఈ జాబితాను ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతోందన్నారు. జాబితాకు అభ్యంతరాలు లేకపోవడంత శాశ్వత పట్టాదారు పుస్తకాల మంజూరుకు ప్రతిపాదనలు పంపనున్నామని తహశీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.తాతబాబు, టీడీపీ నాయకులు వెదురుపర్తి వెంకటాచారి, గ్రామ పెద్దలు అబ్బాయిరమణ, మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వో మూర్తి, రైతులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం


ఏపీటీఎఫ్ మండల కమిటీ సభ్యులు

చీడికాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్యామ్‌కుమార్ కోరారు. ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక తురువోలు హైస్కూల్ ఆవరణలో మంగళవారం సాయంత్రం జరిగింది. సంఘం మండల గౌరవాధ్యక్షులుగా లెక్కల ప్రసాద్, అధ్యక్షుడిగా జీవీఏ.నాయుడు, మండల ప్రధాన కార్యదర్శిగా ఎంటీవీ.ఫణికుమార్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం పూర్వప్రధాన కార్యదర్శి పాటూరి వరహామూర్తి, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.మహాలక్ష్మినాయుడు, కె.విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి వి.దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఇంటింటా ప్రచారం

చోడవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించకుండా చూసుకోవాలంటూ సీపీఎం నాయకులు మంగళవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇళ్లకు బిగించే ఈ స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులకు అనేక ఇబ్బందులు ఉన్నాయని, చార్జీలు భారం కూడా భవిష్యత్‌లో మోయకతప్పదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీవీ శ్రీనివాసరావు, చోడవరం నాయకులు ఎస్‌వీ నాయుడు హెచ్చరించారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్లపై వినియోగదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

మండల సమావేశం 31వ తేదీకి వాయిదా

బుచ్చెయ్యపేట, జూలై 29 (ఆంధ్ర జ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. జిల్లా కలెక్టర్ వడ్డాది గ్రామంలో పర్యటించడంతో అధికారులంతా అక్కడే ఉండిపోయారు. దీంతో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశాన్ని వాయిదా వేయమని కోరారు. దీంతో సమావేశాన్ని ఈనెల 31న ఉదయం 10.30లకు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

బీఎన్ రోడ్డులో వాహనాల తనిఖీ


వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎన్ రోడ్డులో వాహనాలను మంగళవారం ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది తనిఖీలు చేశారు. వాహనాల యజమానుల రికార్డులను పరిశీలించారు. ప్రతి వాహనానికి లైఫ్ ట్యాక్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తప్పక ఉండాలన్నారు.

'వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం'

చీడికాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యత ఇవ్వాలని చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్ సూచించారు. మంగళవారం మంచాల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 46మందికి తనిఖీలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ మొల్లి వరలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశవర్కర్‌లు సేవలు అందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

చీడికాడ, జూలై 29(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో హేమసుందర్రావు కోరారు. మండలంలో వరహాపురం సమీపంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను మంగళవారం పంచాయతీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామంలో ఏ వీధిలో చెత్తచెదారం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొల్లవిల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

బురద దారిలో బిక్కు బిక్కు మంటూ...

- పడి లేస్తూ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు
- భయం భయంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వెళుతున్న గర్భిణులు, బాలింతలు
- ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న రోడ్డు సమస్య
- ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం

మాడుగుల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపాలెం పంచాయతీ పరిధిలోని పులిగుమ్మ్ము, చుట్టుగెడ్డ గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా తయారైంది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలకు సాగించడానికి ఈ రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించే అవకాశం లేకుండా ఉందని వాహనచోదకులు వాపోతున్నారు.

అధ్వానంగా పులిగుమ్మ్ము, చుట్టుగెడ్డ గ్రామాల రహదారి



బురదమయంగా పులిగుమ్ము- చుట్టుగెడ్డ రోడ్డు (ఫైల్ ఫొటో)

మండలంలోని కృష్ణంపాలెం పంచాయతీ పరిధిలోని పులిగుమ్ము, చుట్టుగెడ్డ గ్రామాల్లో సుమారు 200 మంది జనాభా ఉన్నారు. అయితే కృష్ణంపాలెం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా తయా రైంది. దీంతో రోగులను ఆస్పత్రికి తరలించాలన్నా, ఫలసాయాన్ని కృష్ణంపాలెంలో విక్రయించాలన్నా ఈ రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు గ్రామాలకు చెందిన సుమారు 20 మంది విద్యార్థులు కృష్ణంపాలెం, కాశీపురం పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వీరంతా బురదలో నడుచు కుంటూ పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గర్భిణులు, బాలింతలు యలంపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాలంటే గెడ్డ దాటాలి. వర్షాలు కురుస్తున్నప్పుడు వీరు వెళ్లలేని పరిస్థితి ఉంది. భారీ వర్షాలు కురిస్తే ఈ రెండు గ్రామాల ప్రజలు మట్టి రోడ్డులో వెళ్లే అవకాశం లేక ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతి నిధులు, అధికారులు స్పందించి తమ గ్రామాలకు పక్కా రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు.



బురదలో నడిచి వెళుతున్న గ్రామస్థులు (ఫైల్ ఫొటో)



బురదలో నడుచుకుంటూ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు

ఎన్నికల సమయంలోనే మేం గుర్తొస్తాం



ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు మా గ్రామానికి వస్తారు. రోడ్డు సమస్య తీరుస్తామని హామీ ఇస్తారు. ఆ తరువాత కనిపించరు. ఎన్నో ఏళ్లుగా ఇదే జరుగుతోంది. ఈసారి మా గ్రామానికి ఎవరు వచ్చినా అడ్డుకుంటాం.

- **ఓంగ్రు నీలమ్మ**, చుట్టుగెడ్డ గ్రామం

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



కొద్దిపాటి వర్షానికి కూడా మట్టిరోడ్డు బురదమయంగా మారుతోంది. ఈ రోడ్డు గుండా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు పడి లేస్తూ ఒళ్లంతా బురద చేసుకొని వస్తున్నారు. రోడ్డు నిర్మించాలని ఏళ్ల తరబడి వేడుకుంటు న్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

- **జనపరెడ్డి భూలక్ష్మి**, చుట్టుగెడ్డ గ్రామం

మా గ్రామాలంటే చిన్నచూపు



పులిగుమ్ము, చుట్టుగెడ్డ గ్రామాలను ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. రహదారి సౌకర్యం లేక గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లలేకపోతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల ఈ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టినా పట్టించుకోవడం లేదు.

- **ఓంగ్రు చిన అప్పారావు**, పులిగుమ్ము గ్రామం.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా పెను సమస్యలా పరిణమించడం దారుణమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర అన్నారు. ఈనెల 30న మానవ అక్రమ రవాణా దినం సందర్భంగా ఏపీ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం, ఏఈటీఎస్‌ఏసీ ఇండియా, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఏపీ సీఐడీ, హెచ్‌డీటీయూ నోడల్ ఏజెన్సీ, పోలీస్ శాఖలతో పాటు ఎన్జీవో సంస్థల సమన్వయంతో రూపొందించిన 'మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరం' పోస్టర్‌ను మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ రవాణాలో పిల్లలు, మహిళలు, పేదలు, నిరక్షరాస్యులు సమిధలుగా మారుతండడం బాధకరమన్నారు. చక్కని జీవితం, ఉద్యోగం, పెళ్లి పేరిట బోగస్ మాటలతో నమ్మించి వారి జీవితాలను ఛిద్రం చేస్తున్నారన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాతో పాటు బాలికల అక్రమ రవాణా వ్యవస్థను రూపు మాపేందుకు ఫోరం వివిధ శాఖలతో కలిసి పోరాడుతోందన్నారు. దీనిపై విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం ప్రతినిధులు కె.ఎల్లయ్య, బి.లవకుశ, ఎం.ప్రవీణ త్రినాథ్, బి.లక్ష్మణరావు, బి.సురేష్, ఎం.హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అనకాపల్లి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణం, మునగపాక మండలాల సరిహద్దులోని నూకాంబిక ఆలయ ముఖద్వారం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.5,11,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరికొంతమంది పేకాటరాయుళ్లు పరారయ్యారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని పోలీసు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్‌ఐసంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య లోపంపై కలెక్టర్ కన్నెర్ర

... 5వ పేజీ తరువాయి

వస్తానని, పనితీరు మెరుగు పరచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా వడ్డాదిలో నెలకొన్న తాగునీరు, పారిశుధ్యలోపం వంటి సమస్యలను గ్రామస్థులు, కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో సేకరించిన చెత్తను పెద్దేరు నది పక్కన పడేస్తున్నారని, ఇది కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నదని చెప్పారు. పశువైద్యశాలకు డాక్టర్‌ను నియమించాలని కోరారు. గ్రామంలో సర్వే నిర్వహించి ప్రజాసమస్యలపై నివేదిక ఇవ్వాలని ఎంపీడీవో బానోజీరావు, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావులను కలెక్టర్ ఆదేశించారు. ఆమె వెంట జడ్పీ సీఈవో నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్, డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, తహసీల్దార్లు కె.రమాదేవి, ఎం.లక్ష్మి, ఎంపీడీవోలు భానోజీరావు, కొంకి అప్పారావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు వున్నారు.

వయోజనులను అక్షరాస్యులుగా చేయాలి

- ఈ ఏడాది 89,944 మంది లక్ష్యం
- డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా అధికారులు బాధ్యత తీసుకోవాలి : కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులాగా తీర్చిద్దాలన్నదే 'అక్షరాంధ్ర-ఉల్లాస్' (యూఎల్‌ఎల్‌ఏఎస్- అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) లక్ష్యమని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి అక్షరాంధ్ర సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో అక్షరాంధ్ర కార్యక్రమం మొదటి విడతగా ఈ ఏడాది నిరక్షరాస్యులైన 89,944 మంది వయోజనులను అక్షరాస్యులుగా చేయాలన్నారు. ఇందుకోసం డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా అధికారులు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గత ఏడాది జిల్లాలో నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలను గుర్తించి డీఆర్‌డీఏ సహకారంతో అందరినీ అక్షరాస్యులుగా తయారు చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది డీఆర్‌డీఏ శాఖ ద్వారా 50 వేల మంది మహిళలు, డ్వామా ద్వారా 31,339 మంది, నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల పరిధిలోని మెప్మా ద్వారా 8,605 మంది.. మొత్తం 89,944 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి ప్రత్యేక వలంటీర్లతో రోజూ సాయంత్రం అంగన్‌వాడీ కేంద్రం లేదా ప్రభుత్వ భవనంలో తరగతులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నారాయణమూర్తి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వయోజన విద్య శాఖ సంచాలకుడు ఎస్‌ఎస్ వర్మ, జిల్లా సమన్వయాధికారి చిన్నికృష్ణ, డీఈఓ గిడ్డి అప్పారావునాయుడు, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా, ఐసీడీఎస్ పథక సంచాలకులు శచీదేవి, ఎన్.సరోజని, పూర్ణిమాదేవి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా గవర్నర్ హరిబాబుకు ఎంపీ రమేశ్ సత్కారం



ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు శాలువా కప్పి సత్కరిస్తున్న ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్ ఆహ్వానం మేరకు ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మంగళ వారం ఢిల్లీలో ఎంపీ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా హరిబాబుకు సాదరంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ కడా గవర్నర్ హరిబాబును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పారదర్శకంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్

- దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దు
- విశాఖపట్నం ఆర్మీ అధికారులు వెల్లడి

కాకినాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 5వతేదీ నుంచి 20వతేదీ వరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఆర్మీలో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని పేర్కొన్నారు. ప్రధానంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు నియామకం జరుగుతుందని వెల్లడించారు. 8 నుంచి 10 తరగతి పాస్ అయిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్‌టీఆర్, కాకినాడ జిల్లా, యానాం నుంచి ర్యాలీకి అడ్మిట్ కార్డులు పొందిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. గత మార్చి 12న ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం అన్ని ధ్రువపత్రాలను, స్మార్ట్‌ఫోనులను తీసుకురావాలని పేర్కొన్నారు. దళారులు, ఏజెంట్లు, మధ్యవర్తులను నమ్మవద్దని హెచ్చరించారు.

విశాఖ ఉక్కును సెయిల్‌లో కలిపే ప్రతిపాదన లేదు

- ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్-విశాఖ ఉక్కు)ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేసే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పష్టంచేశారు. మంగళవారం సమాజ్ వాదీ పార్టీకి చెందిన ఎంపీ ఆదిత్య యాదవ్ ఈ అంశంపై పార్లమెంటులో ప్రశ్నించారు. ఆర్‌ఐఎన్‌ఎల్‌కు ఆర్థిక, ఆపరేషనల్ సమస్యలు ఉన్నందున సెయిల్‌లో విలీనం చేస్తారా?...అని అడగ్గా, అలాంటిదేమీ లేదని చెబుతూ, ఇప్పటికే రూ.11,440 కోట్ల ఆర్థిక సాయం చేశామని, అదే తరహా సహాయం కొనసాగుతుందని మంత్రి పేర్కొన్నారు.

ఆకట్టుకునే హెచ్‌ఎస్‌ఎల్ బంకర్



రెండవ ప్రపంచ యుద్ధం నాటి బంకర్, (ఇన్‌సెట్‌లో) ఆనాడు ఉపయోగించిన లాంతర్

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)లో ఉన్న బంకర్ మ్యూజియం విశేషంగా ఆకట్టుకుంటుంది. 1941లో షిప్‌యార్డులో నౌకా నిర్మాణ పనులు మొదలైనప్పటికీ 1939లోనే ఈ బంకర్‌ను ఏర్పాటుచేశారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో మన సైనికులు తలదాచుకునేందుకు ఈ బంకర్ ఉపయోగపడినట్టు షిప్‌యార్డు అధికారులు చెబుతుంటారు. బంకర్‌లో ఏర్పాటుచేసిన మ్యూజియంలో షిప్‌యార్డుకు సంబంధించిన విషయాలతో పాటు నాడు రెండో ప్రపంచ యుద్ధంలో చోటుచేసుకున్న సంఘటనలకు సంబంధించిన చిత్రాలను, నాడు వినియోగించిన సిగ్నల్ లైట్, మాగ్నెట్ కంపాస్, బారోమీటర్ వంటి వాటిని ప్రదర్శనకు ఉంచారు. బంకర్‌లోపల సబ్‌మెరైన్ లోపల భాగం ఎలా ఉంటుందో అలాగే ఉంది.

పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు

... 5వ పేజీ తరువాయి

మొత్తం 196 పరిశ్రమలకుగాను 176 పరిశ్రమల్లో తనిఖీలు జరిగాయని, వివిధ శాఖల అధికారులు పాల్గొని ఆయా పరిశ్రమల పనితీరు మెరుగుదలకు 485 సూచనలు ఇచ్చినట్టు ఆమె తెలిపారు. సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.నరసింహారావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావు, జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక భరోసా!

... 5వ పేజీ తరువాయి

జారీ పూర్తయ్యాక రెండు విడతల నిధులను ప్రభుత్వం ఒకేసారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నది.

ఇదిలావుండగా పీఎం కిసాన్ యోజన కింద నవంబరు/ డిసెంబరులో రెండో విడత రూ.2 వేలు, వచ్చే ఏడాది ఫిబ్రవరి/ మార్చి నెలల్లో మూడో విడత రూ.2 వేల చొప్పున కేంద్రం ఇవ్వనున్నది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతలో రూ.7 వేలు, మూడో విడత రూ.6 వేలు చొప్పున ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నది.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రభాకర్ (ఫైల్ ఫొటో)

గొలుగొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడని ఎస్ఐ రామారావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని చోద్యం గ్రామానికి చెందిన పైల అప్పల వెంకట సూర్యప్రభాకర్ (32) సోమవారం రాత్రి 9 గంటల సమయంలో నర్సీపట్నం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. పప్పుశెట్టిపాలెం మలుపు వద్దకు వచ్చేసరికి కుక్క అడ్డంగా రావడంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో స్థానికులు 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడేళ్ల క్రితం సూర్యప్రభాకర్ తండ్రి తాతబ్బాయి కూడా రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు



నుజ్జయిన ఆర్టీసీ బస్సు ముందుభాగం

కశింకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న లారీని అధిగమించే క్రమంలో రోడ్డు పక్కన ఆగివున్న మరో లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన మంగళవారం ఉదయం బయ్యవరం వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు బస్సు డ్రైవర్లకు తీవ్ర గాయాలుకాగా, మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు.. బాపట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయనగరం వెళ్లడానికి సోమవారం రాత్రి బాపట్లలో బయలుదేరింది. మంగళవారం ఉదయం ఆరు గంటల సమయానికి కశింకోట మండలం బయ్యవరం వద్దకు చేరింది. డివైడర్ పక్కగా ముందు వెళుతున్న లారీని ఎడమ వైపు నుంచి ఓవర్ టేక్ చేయడానికి బస్సు డ్రైవర్ ప్రయత్నించాడు. అయితే ఇక్కడ ఎడమవైపున రోడ్డుపై నిలిపివుంచిన లారీని డ్రైవర్ గమనించలేదు. దీంతో ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్లు షేక్ ఖాశీం, డి.సుధాకరరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో వున్న 16 మంది ప్రయాణికుల్లో తెనాలి నుంచి వస్తున్న అమ్మిరెడ్డి చౌడేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావులకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ ఖాశీంకు ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైనలారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైనట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..పార్వతీపురానికి చెందిన శెట్టి భుజంగరావు ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం అనకాపల్లికి వలస వచ్చి ఇక్కడ వేల్పులవీధిలో నివాసం ఉంటున్నాడు. ఇతని కుమార్తె పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లింది. కానీ సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను వాకబు చేసినప్పటికీ ఆచూకీ లభించలేదు దీంతో భుజంగరావు పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

24 కిలోల గంజాయి స్వాధీనం, ఒకరి అరెస్టు

నక్కపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారిపల్లివానిపాలెం హైవే జంక్షన్ వద్ద 24 కిలోల గం జాయిని స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసినట్టు నర్సీ పట్నం డీఎస్పీ పి.శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాలు.. చింతపల్లి మండలం మామిడిపాలెం గ్రామానికి చెందిన సుక్రి అర్జున్, ఒడిశాలో 24 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. కాకినాడ జిల్లా తునిలో గంజాయి మాఫియాకు అందించేందుకు రెండేసి కిలోల చొప్పున ప్యాకింగ్ చేసి బైక్‌పై చింతపల్లి, నర్సీపట్నం, అడ్డురోడ్డు మీదుగా తుని పట్టణానికి వెళుతున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సన్నిబాబు, సిబ్బందితో సారిపల్లివానిపాలెం వద్ద మాటు వేసి, అర్జున్‌ను అడ్డగించి పట్టుకున్నారు. 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. సమావేశంలో కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రాలిక్ ఎక్స్‌కవేటర్ విక్రయం కేసులో ఒకరి అరెస్టు

నర్సీపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ ఇచ్చిన రుణంపై కొనుగోలు చేసిన హైడ్రాలిక్ ఎక్స్‌కవేటర్‌ను విదేశాలకు తరలించి విక్రయించిన కేసులో వేములపూడికి చెందిన గుడివాడ లోవరాజును అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గత నెలలో లోవరాజు రూ.1.25 కోట్ల విలువ చేసే ఎక్స్‌కవేటర్‌ను కొనుగోలు చేయడానికి రూ.35 లక్షలు డౌన్ పేమెంట్ చెల్లించి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ.90 లక్షల రుణం తీసుకున్నాడు. ఎక్కువ లాభం ఎక్కువ వస్తుందన్న ఉద్దేశంతో నిబంధనలు ఉల్లంఘించి వివిధ సంస్థల ద్వారా హైదరాబాద్ నుంచి విదేశాలకు ఎక్స్‌కవేటర్‌ను తరలించాడు. ఫైనాన్స్ కంపెనీ. బ్రాంచ్ మేనేజర్ జగదీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లోవరాజును కోర్టులో హాజరు పరిచామని తెలిపారు.

స్టాండింగ్ కమిటీకి 21 నామినేషన్లు

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయానికి వచ్చామని, కానీ సాదిక్ మాత్రం పార్టీ అనుమతి లేకుండానే నామినేషన్ దాఖలు చేశారని ఆ పార్టీకి చెందిన కొందరు కార్పొరేటర్లు చెబుతున్నారు. రెండో తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండడంతో సాదిక్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఉందని టీడీపీ కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు.

నామినేషన్ వేసిన అభ్యర్థులు...(బ్రాకెట్‌లో వార్డు, పార్టీ)

1. గంకల కవిత (48, బీజేపీ), 2. మహ్మద్ సాదిక్ (39, ఇండిపెండెంట్...జనసేనకు మద్దతు), 3. దాడి వెంకట రామేశ్వరరావు (89, టీడీపీ), 4. సేనాపతి వసంత (97, టీడీపీ), 5.మొల్లి హేమలత (5, టీడీపీ), 6. మాదంశెట్టి చినతల్లి (84, టీడీపీ), 7. గేదెల లావణ్య (17, టీడీపీ), 8. రాపర్తి త్రివేణీవరప్రసాదరావు (93, టీడీపీ), 9.రౌతు శ్రీనివాసరావు (79, టీడీపీ), 10.మొల్లి ముత్యాలు (88, టీడీపీ), 11. కొణతాల నీలిమ (80, టీడీపీ), 12. నక్కెళ్ల లక్ష్మి (20, వైసీపీ), 13. సాది పద్మారెడ్డి (24, వైసీపీ) 14. పల్లా అప్పలకొండ (28, వైసీపీ) 15. బిపిన్‌కుమార్‌జైన్ (31, వైసీపీ) 16. గుండపు నాగేశ్వరరావు (40, వైసీపీ), 17. కోడిగుడ్ల పూర్ణిమ (41; వైసీపీ), 18.రెయ్యి వెంకటరమణ (51, వైసీపీ), 19. కేవీఎన్ శశికళ (55, వైసీపీ), 20. మహ్మద్ ఇమ్రాన్ (66 వైసీపీ), 21. ఉరుకూటి రామచంద్రరావు (70, వైసీపీ)

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షం

... 5వ పేజీ తరువాయి

వెద వరికి నీరు పెట్టాలని చెప్పారు. చెరకు తోటలకు మొజాయిక్ తెగులు ఆశించి తేనెబంక పురుగులు ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వీటి నివారణ కోసం లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల డైమిథోయేట్, లేదా 1.6 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్, ఐదు గ్రాముల మల్టీకెను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సమావేశంలో ప్రధాన శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, సిహెచ్.ఎస్.రామలక్ష్మి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454